ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 9 డిసెంబరు 2024 | 5

ఇదీ రాజమహేంద్రవరం ఆవ రోడ్డులోని ఒక డ్రెయినేజీ పరిస్థితి..దీనిని బట్టి ఎంత ప్లాస్టిక్ వాడుతున్నామో ఇట్టే చెప్పేయవచ్చు.. ఒక్కసారి ఈ డ్రెయినేజీని తీక్షణగా చూడండి.. అందులో ఏం కనిపిస్తున్నాయో.. అన్నీ కవర్లు.. వాటర్ బాటిల్స్.. అంతా ప్లాస్టిక్.. ఏదైనా గుడ్డ సంచి అయితే తడిచి నేలలో కలిసిపోయేది.. ప్లాస్టిక్ కావడంతో అది మునగదు.. మురుగు నీటిని ముందుకు పోనీయదు.. ఎక్కడికక్కడ అడ్డుపడుతూనే ఉంటుంది.. అందుకే ఇకనైనా మారండి.. ప్లాస్టిక్ సంచిని వదిలేసి గుడ్డ సంచివాడండి!



కాకినాడ జేఎన్‌టీయూలో ఎమ్మెల్సీ కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

మా..స్టారొస్తారు!

ఎమ్మెల్సీ ఫలితం తేలేది నేడే

- ఉదయం 8 నుంచి లెక్కింపు
- బరిలో ఐదుగురు అభ్యర్థులు
- ఇద్దరి మధ్య ప్రధాన పోటీ
- పోలైన ఓట్లు 15,490
- బ్యాలెట్ పద్ధతిన లెక్కింపు
- ఆలస్యంగా రానున్న ఫలితం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మా..స్టారెవరో మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.. ఇప్పటికే ఫలితం బాక్సుల్లో భద్రంగా ఉంది.. నేటి లెక్కింపుతో ఉత్కంఠకు తెరపడుతుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపు కాకినాడ జెఎన్‌టీయూలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఆరంభమవుతుంది. బ్యాలెట్ పత్రాల లెక్కింపు వల్ల కౌంటింగ్ కాస్త నెమ్మదిగా జరగవచ్చు.ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో మొత్తం 16,737 మంది ఓటర్లు ఉండగా 15,502 ఓట్లు పోలయ్యాయి.అది 92.62 శాతంగా ప్రకటించారు. కానీ ఈ రోజు ప్రకటనలో పోలైన ఓట్లు 15,490గా చెబుతున్నారు.12 ఓట్లు తేడా వచ్చింది.యూటీఎఫ్‌కు చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ గతేడాది ఉండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో మొత్తం ఐదు గురు అభ్యర్థులు స్వతంత్రంగా పోటీపడ్డారు. యూటీఎఫ్ నేత బొర్రా గోపీమూర్తి, గంధం నారాయణరావు, పులుగు దీపక్, డా.కవల నాగేశ్వరరావు, నామన వెంకటలక్ష్మి(విళ్ల లక్ష్మి) పోటీ పడ్డారు. కానీ పోటీ ప్రధానంగా బొర్రా గోపీమూర్తి,గంధం నారాయణరావు మధ్యే ఉంటుందనే ఆయా వర్గాల కథనం. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువగా గోపీమూర్తికి వేయగా, ప్రైవేట్ స్కూళ్ల నుంచి నారాయణరావుకు ఓట్లు బాగా పడినట్టు ప్రచారం జరుగుతోంది. ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికలంటే చాలా ప్రాధాన్యత ఉంటుంది. గతంలో కార్పొరేట్ విద్యాసంస్థల యజమానులు పోటీ చేసి గెలిచిన సందర్భాలు ఉన్నాయి.ఈ సారి పోటీ రసవత్తరంగానే సాగినట్టు చెప్పవచ్చు. మిగతా అభ్యర్థులు కొంతమేర ఓట్లను చీల్చే అవకాశం ఉంది. వైసీపీ ఐదేళ్లలో టీచర్ల నోళ్లను వైసీపీ ప్రభుత్వం నొక్కేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శాసన మండలిలో తమ తరపున మాట్లాడడానికి ఉపాధ్యాయ వృత్తి నుంచి వచ్చిన ఉద్యమ నేతకే పట్టం కట్టాలని కొన్ని సంఘాలు భావించాయి.ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులను పోటీకి పెట్టలేదు. ఇక్కడ సీపీఐ మాత్రం ఎస్టీయు సంఘం తరపున గంధం నారాయణరావుకు సపోర్టు చేయడం గమనార్హం. పార్టీలకతీతంగా ఎన్నికలు జరగడంతో పెద్దగా ప్రచార ఆర్భాటం కనిపించని సంగతి తెలిసిందే.గెలుపు ఎవరిదనే దానిపై ఎవరి ధీమా వారికి ఉంది.

14 టేబుళ్లపై.. 9 రౌండ్లలో లెక్కింపు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఆర్వో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 5న తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గం సంబంధించిన పోలింగ్ ప్రక్రియ జరిగిందన్నారు. ఈ పోలింగ్ ప్రక్రియలో 15,490 ఓట్లు నమోదయ్యాయన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో భద్రపరిచామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామన్నారు.కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఉదయం 6గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. 14 టేబుళ్లపై 9రౌండ్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. తొలిదశలో ప్రాథమిక ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం డీటెయిల్డ్ కౌంటింగ్ నిర్వహించామన్నారు.

కౌంటింగ్‌కు డ్రోన్ కెమెరాలతో పటిష్ట నిఘా : ఎస్పీ



స్ట్రాంగ్ రూమ్ పరిశీలిస్తున్న ఎస్పీ

కాకినాడక్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ కాకినాడ జేఎన్‌టీయూకేలో ఆదివారం పరిశీలించారు.ఇన్, అవుట్ గేట్ల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణును ఆదేశించారు. ఎలక్షన్ అధికారులు,పోలింగ్ ఏజెంట్ల సెల్‌ఫోన్లను బయట సెల్‌ఫోన్ కౌంటర్లలో జమ చేసి లోనికి వెళ్లాలని సూచించారు. కౌంటింగ్ నిర్వహించే భవనాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను కూడా పరిశీలించారు. జేఎన్‌టీయూకే ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో వాహనాలను పార్క్ చేసి కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, సర్పవరం సీఐ బి.పెద్దిరాజు, ట్రాఫిక్-2 సీఐ డి.రామారావు ఉన్నారు.

పోలీసులమని భయపెట్టి.. రూ.4.15 లక్షలు లాగేశారు!

రాజమహేంద్రవరంలో సైబర్ మోసం - వన్‌టౌన్‌లో కేసు నమోదు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : ముంబై క్రైమ్ పోలీసులుపేరుతో భయపెట్టి రాజమహేంద్రవరానికి చెందిన ఒక వ్యక్తి నుంచి రూ.4.15 లక్షలు దోచిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వన్‌టౌన్ పోలీసులు కథనం ప్రకారం. గత నెల 12న రాజమహేంద్రవరం జాంపేటకు చెందిన కె.ఆదిత్య ఫోన్‌కు ఒక కాల్ వచ్చింది. ఆ కాల్‌లో మాట్లాడిన వారు తాము ముంబై క్రైమ్ పోలీసులమని.. నీ అకౌంట్ నుంచి మనీలాండరింగ్ జరుగుతుందని నువ్వేం చేస్తున్నావని భయపెట్టారు. తనకు సంబంధంలేదని బాధితుడు చెప్పినా వినకుండా కాల్ కట్ చేసి వీడియోకాల్ చేసి పోలీస్ యూనిఫాంలో మాట్లాడారు. నీ అకౌంట్లు డిజిటల్ అరెస్టు చేశామని నిన్ను కూడా అదుపులోకి తీసుకుంటామని భయపెట్టడంతో ఆదిత్య హడలిపోయాడు. తనకు ఏవిధమైన సంబంధంలేదని సమాధానం ఇచ్చాడు. అయినా అవతల వ్యక్తి భయపెట్టి నిన్ను రక్షిస్తామని నీఅకౌంట్‌లో డబ్బును తాము చెప్పిన అకౌంట్‌కు జమచేయాలని చెప్పడంతో ఆలోచించకుండా రూ.4.15 లక్షలు అకౌంట్ ట్రాన్స్‌ఫర్ చేసేశాడు.కొద్ది రోజుల తర్వాత డిజిటల్ అరెస్టు అనేదానిపై ఆరా తీశాడు.అటువంటిది ఉండదని తెలుసుకున్న ఆదిత్య తాను మోసపోయానని గ్రహించి ఐటీ పోలీస్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. కేసును వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదలాయించడంతో ఆదివారం కేసు నమోదు చేశారు.



విశాఖపట్నంలో వైశాఖేశ్వర స్వామి దేవస్థానానికి దాతలు ఒక ఆవును ఇచ్చారు.. ఆ ఆవు ఆశ్రమానికి వచ్చినప్పటి నుంచి మేత తినడంలేదు.. దీంతో ఆ ఆలయ సిబ్బంది పశువైద్యాధి కారులకు సమాచారం ఇచ్చారు.. వారు వచ్చి ఆవు పొట్టలోపల పరిశీలించి ఇంక బతకదని చెప్పారు.. ఎందుకని అడిగితే.. లోపలంతా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉన్నాయని చెప్పారు.. మనం ఏం కావాల్సిన ప్లాస్టిక్ కవర్లలోనే తెచ్చుకుంటున్నాం.. ఆ తరువాత వాటిని ఇష్టానుసారం పాడేస్తున్నాం.. ఆ ప్లాస్టిక్ కవర్లు ఆవులు తింటున్నాయి.. కుక్కలు తింటున్నాయి.. పక్షులు తింటున్నాయి.. అరగక చచ్చిపోతున్నాయి.. అది మనకు పాపమే కదా.. అందుకే ఇక నుంచి ప్లాస్టిక్ కవర్లు వదిలేద్దాం..గుడ్డ సంచిని వాడండి..అలాగని ఈనాడే ఒక ప్రతిజ్ఞ చేయండి.. ఇక గుడ్డ సంచినే వాడాలని ప్రవచనకర్త గరికపాటి సూచించారు..!?

ప్రమాదమన్నా పట్టించుకోవడంలేదు.. వదిలేయమన్నా వదలడం లేదు.. మన ఒక్కరితో పోయేదా అంటే అదీ కాదు.. ఖాళీ చేతులతో మార్కెట్‌కి వెళ్లడం.. కవర్లతో తిరిగిరావడం.. అందులోవి తీసి ప్లాస్టిక్ కవర్లు బయటపారేయడం.. ఎవరేమైపోతే మాకేం అనుకుంటున్నారు.. మీకూ ప్రమాదమన్నా పట్టించుకోవడంలేదు.. ప్లాస్టిక్ వినియోగం జీవితంలో ఒక భాగమైపోయింది.. అధికారుల నియంత్రణ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారం ఇచ్చేస్తున్నారు.. ఈ చిత్రాల్లోని డ్రైనేజీలనే చూడండి..ప్లాస్టిక్ ఎలా పేరుకుపోయిందో.. కొంత మందైనా గుడ్డ సంచినే వాడతామని ఈ రోజు ఒక ప్రతిజ్ఞ చేయండి..ప్లాస్టిక్ భూతాన్ని వదిలించండి..

మహా.. భూతం!



ఈ రోజే వదిలేద్దాం!

- పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం
- మానవ జీవనానికి విఘాతం
- ప్రమాదమన్నా పట్టని వైనం
- గుడ్డ సంచిని వదిలేసిన జనం
- ప్లాస్టిక్ సంచులతో కాలక్షేపం
- కొరవడిన అధికారుల నిఘా
- వ్యాపారుల ఇష్టారాజ్యం
- ప్లాస్టిక్‌పై చాగంటి ఆవేదన

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మనిషి మనుగడపై మనిషే గొడ్డలి వేటు వేసుకుంటున్నాడు..జీవరాశి మనుగడను ప్రమాదంలో పడేస్తున్నాడు.ఇందులో ప్రధానమైనది ప్లాస్టిక్.. ప్రస్తుతం ప్రళయంగా ముంచెత్తుతోంది. కంటికి కనిపించని ప్లాస్టిక్ రేణువులు క్యాన్సర్‌కి కారణమవుతుండగా..మనం వాడిపడేస్తున్న ప్లాస్టిక్ కవర్లు,ఉపకరణాలు పర్యావరణాన్ని కాటు వేస్తున్నాయి.డ్రైనేజీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి.ప్లాస్టిక్ సంచులు ప్యాషన్ అనుకుంటూ.. వస్త్రం,నారతో చేసి చేతి సంచులను పక్కన పడేసి రకరకాల జబ్బులను కొనితెచ్చు కుంటున్నాం. ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్న వస్తువులన్నీ ప్లాస్టిక్ సంచులు, కవర్లలోనే ఉంటున్నాయి. ప్రస్తుతం అంతా ప్లాస్టిక్‌మయం..ఈ వ్యర్థాలు స్వచ్ఛ భారత్‌కి సవాల్ విసురుతున్నాయి.

ఎక్కడ చూసినా..

ప్లాస్టిక్ భూతం మానవ మనుగడలో అంతర్భాగమైపోయింది. ఏదో రకంగా ప్రతి రోజూ ప్లాస్టిక్‌తోనే పయనం సాగిస్తున్నాం.ప్లాస్టిక్ (పాలిథీన్) సంచులు విచ్చలవిడిగా వాడేస్తు న్నాం.

కీడు అంతా ఇంతా కాదు..

ఒక్క ప్లాస్టిక్ కవరు భూమిలో కలవడానికి 10 లక్షల సంవత్సరాలు పడుతుందట. ఈలోపు అది చేసే కీడు అంతా ఇంతా కాదు. వర్షం నీటిని భూమిలో ఇంకనివ్వవు. భూగర్భజలాలు తగ్గిపోతాయి. డ్రైన్లు పూడికతో నిండిపోతాయి. నదీ జలాలు కలుషితం అవుతాయి. జీవరాశి మృత్యువాత పడుతుంది. మనుషులు రకరకాల రుగ్మతల బారిన పడుతున్నారు. అందువల్ల పాలిథీన్,సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధిస్తూ స్వీయ శపథాన్ని ఈ రోజే చెయ్యండి.వేడుకలు, హోటళ్లు తదితర చోట్ల కాగితం గ్లాసులు, అరటి, విస్తరి (అడ్డాకులు) ఆకుల వాడకాన్ని అలవాటు చేసుకో వాలి. అరటి, అడ్డాకు విస్తరిలో భోజనం శ్రేష్ఠమని పెద్దలు ఎప్పుడో చెప్పారు కదా!మిగతా ప్లాస్టిక్ ఉపకరణాలను తగ్గించాలి.ఇంటి నుంచి బయ టకు వెళ్లేప్పుడు జనపనార,వస్త్రంతో చేసిన సంచులను తీసుకెళ్లడం బాధ్యతగా అనుకుంటే ప్లాస్టిక్ సమస్యలకు పరిష్కారం దొరికినట్లే.

అన్ని మైక్రాన్లు, ఇన్ని మైక్రాన్లు అంటూ పరిమితుల మాట ఎలా ఉన్నా జీవరాశి మను గడకు పెనుముప్పుగా పరిణమించాయనేది ఎన్నో సర్వేలు తేల్చిన నిజం.అయినా జనం పెడచెవిన పెడుతుండగా..ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోవడం లేదు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని వినియోగించడం వంటి వాటి వల్ల ఒక మనిషి శరీరంలోకి వారానికి సగటున 5గ్రాముల మైక్రో ప్లాస్టిక్‌లు చేరుతున్నాయని ఓ సర్వే భయంకరమైన నిజాన్ని బయట పెట్టింది. ప్లాస్టిక్ తయారీకి ముడి చమురును మూల పదార్థంగా వాడతారు. వివిధ ఆకృతులు, రంగులు రావడానికి ఎన్నో రసాయనాలు కలుపుతారు.వీటి వల్ల రకరకాల క్యాన్సర్లు, హార్మోన్ అసమతుల్యత, గర్భం దాల్చడంలో ప్రతికూలతలు, చర్మ వ్యాధులు, శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం..ఇలా రకరకాల రుగ్మతల బారిన పడుతున్నామని సర్వేలు పోరు పెడుతూనే ఉన్నాయి.

జిల్లాలో రోజుకు 50 టన్నులు

తూర్పుగోదావరి జిల్లాలో రోజుకు సగటున 200 టన్నుల వ్యర్థాలు వేడుకలు, గృహాలు, వాణిజ్య ప్రదేశాల నుంచి ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలో కనీసం 50 టన్నులపైనే ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయనేది చేదు నిజం. వీటిలో అధిక శాతం సింగిల్ యూజ్(ఒకసారి వాడి పారేసేవి), పాలిథీన్, ఆహార పదార్థాల ప్యాకింగ్ కవర్లను స్థానిక సంస్థలు నిషేధించినా.. అమలులో మాత్రం చిత్తశుద్ధి కొరవడింది. కిందిస్థాయి సిబ్బందికి డబ్బులు వచ్చే మార్గంగా జరిమానాల తంతు మారిపోయింది.దీంతో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ సంచులు, కవర్లు ఉంటున్నాయి. అసలు అవి విక్రయించే దుకాణాల ద్వారా రోజూ కనీసం టన్ను వరకూ పాలిథీన్ కవర్లు జనాల్లోకి వెళుతున్నాయని ఓ అంచనా ఉంది.అయితే స్వచ్ఛ భారత్ వంటి పురస్కారాల కోసం ఈ ప్లాస్టిక్ వ్యర్థాల లెక్కను తొక్కిపడుతున్నారనే విమర్శలున్నాయి.



ఇదీ పాలకుల బాధ్యత..

ప్లాస్టిక్.. ముఖ్యంగా పాలిథీన్ సంచులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించా లనే నిబద్ధతతో యంత్రాంగం నిషేధాన్ని అమలు చేయాలి.దీనిలో రాజకీయ నాయకులు భాగస్వామ్యం కావాలి.విస్తృతంగా అవగాహన కల్పించాలి. జనపనార, వస్త్రంతో చేసిన సంచుల తయారీదారులను ప్రోత్సహించాలి. తక్కువ ధరకు అందుబాటులోకి తేవాలి.స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పంపిణీ చేయడానికి చొరవ చూపాలి. బంగాళా దుంపలతో తయారు చేసిన సంచులను బ్రిటన్,జపాన్‌లో విరివిగా వాడుతున్నారు. బంగాళాదుంప నుంచి తీసే పిండి బయో పాలిమర్ ప్లాస్టిక్ లక్షణాలను కలిగి ఉంటుంది. కాబట్టి ఇది కొద్దిరోజులకే భూమిలో కలిసిపో తుంది. ఇలాంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి.



కాపాడమ్మా.. కోటసత్తెమ్మ

నిడదవోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మకు ఆదివారం విశేష పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి,నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.1,25,053లు ఆదాయం లభించినట్లు సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్,ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

దంచికొట్టిన వాన

2 గంటల పాటు ఏకధాటిగా చినుకులు

రాజమహేంద్రవరంఅర్బన్/ సిటీ/ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒక్కసారిగా ఆకాశం అంతా మబ్బు పట్టిం ది..ఆదివారం 4 గంటలకే చీకట్లు కమ్మేసింది.. కాసేపటికే పెద్ద ఎత్తున వర్షం పడింది..ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసింది.అయితే సాయంత్రం ఊహించని రీతిలో అకస్మాత్తుగా వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. సుమారు రెండు గంటల పాటు దంచికొట్టింది.. చిరుజల్లులు ఆరంభమవడంతో జనం పెద్దగా లెక్క చేయలేదు.. ఆదివారం కావడంతో సాయంత్రం సరదాగా నగరవాసులంతా బయటకు వచ్చేశారు. పెద్ద ఎత్తున వర్షం పడడంతో దిక్కుతోచక ఎక్క డికక్కడ పెద్ద ఎత్తున జనం గుమి గూడిపోయారు. వివిధ పనుల కోసం బయటకు వెళ్లిన వారు ఒక్కసారిగా కురిసిన వర్షంతో తడిసి ముద్దయ్యారు. సాయంత్రం ఐదు గంటల నుంచి వర్షం పడింది. ఉరుములు, మెరుపులు లేకుండా వాతావరణం మారిపోయి ఒక్కసారిగా వర్షం ప్రారంభం కావడంతో ప్రజలు షెల్టర్లలోకి పరుగులు పెట్టారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు రోడెక్కింది. భారీ వర్షానికి రాజ మహేంద్రవరం రూరల్, కడియం మండలాల్లో రైతులు పరుగులు పెట్టారు. సా యంత్రం ధాన్యం పొలంగట్ల వెంబడి సర్దుకునే సమయంలో భారీ వర్షం పడడంతో చాలా చోట్ల రైతులు టార్పాలిన్లు కప్పుకు నేందుకు పరుగులు తీశారు.బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసినా ఇలా ఆకస్మికంగా వర్షం పడుతుందని ఊహించలేదు. రాత్రి సమయంలోనూ ఆకాశంలో మేఘాలు కమ్ముకుని ఉన్నాయి. ఇదిలా ఉంటే గత రెండు రోజులుగా చలి ప్రభావం పెద్దగా లేదు. రాత్రి సమయంలోనూ చలి పెట్టడంలేదు. అల్పపీడనం కారణంగా చోటుచేసుకున్న వాతావరణ మార్పులతో చలి తగ్గినట్టు భావిస్తున్నారు. ఇలాంటి సమయంలో ఒక మోస్తరు వర్షం కురిసినా చల్లదనం లేకపోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.



రాజమండ్రిలో వాన

నేడు పీజీఆర్‌ఎస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం యధాతధంగా పీజీఆర్ఎస్ మీకోసం కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం సేవలు సోమవారం నుంచి అందుబాటులో ఉంటాయన్నారు.ఫోన్ నెంబరు మార్పు, కొత్త ఆధార్ నమోదు, పేరు మార్పు, చిరునామ మార్పులతో పాటు రెవెన్యూ అనుబంధ సేవలైన ఆదాయ,నివాస, కుల ధ్రువీకరణ పత్రాల సేవలు అందిస్తారన్నారు. పీజీఆర్‌ఎస్‌కు వచ్చే ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవచ్చన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 2473 మంది హాజరు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి జాతీయ ఉపకార వేతన అర్హత పరీక్ష(ఎన్ఎంఎంఎస్) ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది.పరీక్షలు జిల్లావ్యాప్తంగా 13 కేంద్రాల్లో నిర్వహించామని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. పోలీస్, మెడికల్ సిబ్బంది ఉపాధ్యాయుల సహకారంతో పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో 2742 మంది హాజరు కావాల్సి ఉండగా 2473 మంది హాజరయ్యారని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు జరిగాయని డీఈవో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి 7

వైభవంగా శ్రీ పుష్పయోగ మహోత్సవం

అన్నవరంలో ముగిసిన సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్య కల్యాణోత్సవాలు



పుష్పోత్సవంలో నవదంపతులు

అన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో కొలువైయున్న సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్య కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. రాత్రి 7గంటలకు పండితులు ఆధ్వర్యంలో శ్రీపుష్పయోగ మహోత్సవం అంగరగ వైభవంగా జరిగింది. ముందుగా నవ దంపతులైన శ్రీవల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యశ్వరులను ప్రత్యేకంగా సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన ఊగుటూయలలో ఆశీనులు గావించి గణపతిపూజ, పుణ్యాహవచనం, పుష్పోత్సవం నిర్వహించారు. విశేషమైన మధురఫలాలు, తీపిపదార్థాలను నవదంపతదులకు నివేదించి దంపతీతాంబూలాలు అందించారు. అనంతరం చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం ఏకాంతసేవ నిర్వహించారు.



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బిక్కవోలులో కనుల పండువగా రథోత్సవం

వైభవంగా శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు



బిక్కవోలులో శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారు, మెయిన్‌రోడ్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు

బిక్కవోలు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, బ్యాండు మేళాల మధ్య ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. రథం ముందు బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి కోలాట మండలి సభ్యుల కోలాటం, బ్యాండ్ కచేరిలు, కేరళ వాయిద్యాలు అందర్నీ అలరించాయి. స్వామివారి రథం వంగా వారి వీధి నుంచి మెయిన్‌రోడ్ మీదుగా రాజారావుపేట, గ్రామంలోని పురవీధుల గుండా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. కార్యక్రమంలో లక్ష్మీగణపతి ఆలయ ఛైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, వంగా పుల్లా రెడ్డి, తొండాపు శ్రీనివాసరెడ్డి, మానుకొండ రాంబాబు, నందిపాటి కిషోర్‌రెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, పల్లి రాజారెడ్డి, కొమ్మోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనపర్తి సీఐ సుమంత్ ఆధ్వర్యంలో పోలీసులు రథం చుట్టూ బందోబస్తు నిర్వహించారు.

బాణసంచా కాల్పులు, గ్రామోత్సవం

షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి గ్రామోత్సవం, బాణసంచా కాల్పులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవంలో తీన్‌మార్, బ్యాండ్ కచేరీలు, నెమలి నాట్యాలు, నవదుర్గలు కనువిందు చేశారు. అలాగే బిక్కవోలు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాణసంచా కాల్పివేత అందర్నీ మంత్ర ముగ్ధులను చేసింది. ఈతచెట్టు, మల్లెపందిరి, నిప్పులు వెదజల్లే షాట్‌లు, రంగురంగుల కాంతులిచ్చే బిగ్ షాట్‌లు, నిప్పురవ్వలు విడుస్తూ వెళ్లే రాకెట్‌లు కాల్చారు.



బాణసంచా కాంతులు

కాకినాడలో సినీ నటి శ్రీలీల సందడి

జేసీ షాపింగ్ మాల్ ప్రారంభం



కాకినాడలో జేసీ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న శ్రీలీల



షాపింగ్ మాల్‌లో సందడి చేస్తున్న శ్రీలీల

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో ప్రముఖ సినీ నటి శ్రీలీల సందడి చేశారు. ఆదివారం ప్రముఖ జేసీ షాపింగ్ మాల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యనూతన ఫ్యాషన్లకు నిలయమైన జేసీ మాల్‌ను కాకినాడలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మూడంతస్తుల్లో ఉన్న మాల్ సముదాయంలోని వస్త్రాలను ఆమె పరిశీలించారు. పట్టు, ఫ్యాన్సీ చీరలను చూపించారు. తెలుగు రాష్ట్రాల్లో చాలా షోరూంలు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో కాకినాడ షోరూం మూడోదిగా పేర్కొన్నారు. జేసీ మాల్‌లో అన్ని వర్గాలవారికి అందుబాటు ధరల్లో ఆధునిక శైలితో కూడిన వస్త్రాలను అమ్మకాలు చేస్తుంటారన్నారు. కాకినాడ పరిసర ప్రాంతాలవాసులు ఇక్కడి జేసీ మాల్‌కు వచ్చి కొనుగోలు చేయాలన్నారు. మహిళలు, యువతులు, చిన్నారులు, పురుషులకు ఇక్కడ అద్భుతమైన వస్త్రశేణి ఉందన్నారు. జేసీ మాల్ అధినేతలు ఎం.వెంకటరెడ్డి, జమున మాట్లాడుతూ కాంబో ఆఫర్లను ఇస్తున్నామన్నారు. తక్కువ ధరలో నాణ్యతతో కూడిన వస్త్రాలను అమ్మకాలు చేయడమే తమ విజయ సూత్రమన్నారు. అనంతరం శ్రీలీల మాల్ బయట ఏర్పాటు చేసిన వేదికపైకి రాగానే యువత కేరింతలు కొట్టారు. ఆమె లవ్ కాకినాడ అంటూ అందరినీ ఉత్సాహపరిచారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ రాజ్యలక్ష్మి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం

తొలిరోజు సర్వపుష్ప పూజ



సర్వపుష్పపూజ అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతుల అలంకారం



పిఠాపురం పురవీధుల్లో దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం

పిఠాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రాచుర్యం పొందిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు మహాగణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తములతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, వేదపారాయణ, రుత్విక్కులచే మూల మంత్ర అనుష్ఠానం, గణపతి అధర్వ శీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ జరిగాయి. సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, శ్రీపాదశ్రీవల్లభుల దివ్యపాదపద్మములకు వివిధ హారతులు, స్వామివారికి పల్లకిసేవ, సాయంకాలార్చన నిర్వహించారు. అంతకు ముందు ఉదయం దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. పురవీధుల్లో ఉత్సవం సాగింది. సర్వపుష్ప అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాల తొలిరోజు మహారాష్ట్ర, ఉభయ తెలుగురాష్ట్రాలు, కర్నాటక నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి సౌజన్య తదితరులున్నారు.

పాదగయలో నేటి నుంచి...

పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభువమూర్తిగా వెలసిన దత్తాత్రేయస్వామి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. వేదోక్త విధినను సరించి దత్తాత్రేయ మంత్రానుష్ఠానము, హోమములు, గురుచరిత్ర పారాయణము, వేదపారాయణ, యతిపూజ, లక్ష బిల్వార్చన, సత్యదత్త వ్రతాదులతో సప్తాహదీక్షతో ఉత్సవాలు నిర్వహిస్తారు. డిసెంబరు 15 వరకూ జరిగే ఉత్సవాల్లో రోజూ మహాగణపతిపూజ, కలశస్థాపనలు, రుత్విక్‌వరణములు, పంచామృతాభిషేక సహిత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, రుత్విక్కులతో దత్తమాల మంత్ర అనుష్ఠానం, గురుచరిత్ర పారాయణ, వేదపారాయణ, గణపతి అథర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, విష్ణు, లలితా సహస్రనామ పారాయణలు, మధ్యాహ్నం 3గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, దత్తమాల మంత్రహోమాదులు, సాయంత్రం సాయంకాల విశేష పుష్పార్చన జరుగుతాయి.

హైదరాబాద్ నుంచి పిఠాపురం దత్త పీఠానికి...

పాదయాత్రగా ఆలమూరు చేరుకున్న బృందం



పిఠాపురం దత్త పీఠానికి పాదయాత్ర చేస్తున్న బృందం సభ్యులు

ఆలమూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీదత్తపీఠానికి హైదరాదాద్‌లోని శ్రీవల్లభదత్త పీఠం నుంచి పాదయాత్ర చేస్తున్న బృందం ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరుకు చేరుకుంది. లోకశాంతి కోసం ఈనెల 3న హైదరాబాద్‌లో శ్రీవల్లభదత్త పీఠం మాతాజీ శ్రీలత దత్త ఆధ్వర్యంలో బయలుదేరిన బృందం ఈనెల 11కు పిఠాపురం చేరుకోనున్నారు. ఆలమూరు నుంచి గుమ్మిలేరు చేరుకున్నవారికి పద్మావతి సేవా కేంద్రంలో సర్పంచ్ గుణ్ణం రాంబాబు బస ఏర్పాటు చేశారు. శ్రీవల్లభుని కర్మ, భక్తి సిద్ధాంతాన్ని అనుసరిస్తూ సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తూ పాదయాత్ర చేస్తున్న బృందాన్ని గుమ్మిలేరు గ్రామస్తులు అభినందించారు.

దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

125 గ్రాముల బంగారు వస్తువుల స్వాధీనం

రాజోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలో రెండు చోట్ల ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడిన పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం మండలం యర్రంశెట్టివారిపాలేనికి చెందిన కె.వెంకటేశ్వరరావును అరెస్టు చేసి రూ.8 లక్షల 50వేలు విలువ చేసే 125 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నామని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. రాజోలు పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన వివరాలు తెలిపారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలో బీరవారి కాల్వగట్టుకు చెందిన బీరా సువర్ణరాజు, చెల్లుబోయిన వెంకటేశ్వరరావులకు చెందిన ఇంట్లో ఏడాది క్రితం దొంగతనం జరిగిందన్నారు. నిందితుడు వెంకటేశ్వరరావును గుర్తించి దిండి చెక్‌పోస్టు వద్ద సఖినేటిపల్లి ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాసరావు అరెస్టు చేసినట్టు తెలిపారు. కేసును చేధించిన సీఐ, ఎస్‌ఐ, సిబ్బందిని డీఎస్పీ గోవిందరావు, ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

ఇరువర్గాల కొట్లాటలో 20 మందిపై కేసులు

ఆత్రేయపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకల్లో భాగంగా రెండు సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు ఘర్షణకు దిగి దాడులకు పాల్పడడంతో 20 మందిపై కేసులు నమోదు అయ్యాయి. ఈ సంఘటనల నేపథ్యంలో పోలీస్ పికెట్ కొనసాగుతుంది. ఆదివారం ఇరువర్గాలకు చెందిన పెద్దలతో సీఐ విద్యాసాగర్ శాంతి సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. 2 సామాజిక వర్గాలు శాంతియుతంగా నడుచుకోవాలన్నారు. శనివారం రాత్రి పేరవరంలో షష్ఠి తీర్థమహోత్సవంలో తమపై దాడులకు పాల్పడిన్నట్టు ఒక వర్గానికి చెందిన వెంకటేశ్వరరావు, మరోవర్గానికి చెందిన తాళ్ళ గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 20మందిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాము తెలిపారు.

ప్రజా హక్కుల పోరాటంలో 'ఐలాజ్' ముఖ్యపాత్ర

అన్నవరంలో మొదటి రాష్ట్ర మహాసభ



ప్రసంగిస్తున్న జాతీయ ప్రధాన కార్యదర్శి రత్నకుమార్

అన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా న్యాయవాదుల ప్రయోజనాలు కాపాడటంతో పాటుగా ప్రజల హక్కుల పోరాటంలో ఆల్‌ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ముఖ్య పాత్ర పోషిస్తుందని రాష్ట్ర నాయకులు బుగత శివ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడలో అన్నవరంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో మొదటి రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాతీయ ప్రధాన కార్యదర్శి క్లిఫ్టన్ డి రోజారియో విచ్చేశారు. ఐలాజ్ రెండేళ్లుగా న్యాయవాదులపై, మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించి వాటిని అరికట్టేందుకు ఉద్యమించడం జరిగిందన్నారు. 60 ఏళ్ల దాటిన న్యాయవాదులను పెన్షన్ల సౌకర్యం కల్పించడం, మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలపై పోరాటం చేస్తుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దులో ఐలాజ్ ముఖ్య భూమిక పోషించిందన్నారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి జేసు రత్నకుమార్, ఐలాజ్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం 15 మందితో నూతన రాష్ట్రకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా రాం ప్రసాద్, ఉపాధ్యక్షులుగా రాఘవేంద్ర రావు, కార్యదర్శిగా బుగతా శివ కోశాధికారిగా అవసరాల శ్రీదేవి ఎన్నికయ్యారు.



కార్యక్రమానికి హాజరైన న్యాయవాదులు

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఒకరి మృతి మరొకరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో ఆటో, మృతిచెందిన సూర్యచంద్రం

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఉల్లిపాయల లోడు ఆటోను ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రగాయాల పాలయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కె.సూర్యచంద్రం (35), శ్రీరాముల దుర్గారావు ఊరూరా తిరుగుతూ ఆటోలో ఉల్లిపాయలు వ్యాపారం చేస్తుంటారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో ఆదివారం ఉల్లిపాయలు విక్రయించుకుని కాపవరం వైపు వస్తుండగా కాపవరం జంక్షన్‌లోని రాళ్ళమడుగు వంతెనపై నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందువెళుతున్న లారీని తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న డ్రైవర్, ఉల్లిపాయలు విక్రయిస్తున్న ఇద్దరు కిందపడిపోయారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి.. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. ఆటోడ్రైవర్ కె.సూర్యచంద్రం (35) ఆసుపత్రిలో మృతిచెందాడు. మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీరాముల దుర్గారావును జీఎస్ఎల్‌కు తరలించారు. కొవ్వూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ హత్య

వివాహేతర సంబంధమే కారణం?



మీనాకుమారి మృతదేహం

కాకినాడ క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ మహిళ హత్యకు గురైన సంఘటన ఆదివారం కాకినాడలో జరిగింది. కాకినాడ పర్లోవపేట ఏఎంజీ స్కూల్ వెనుక వీధికి చెందిన ఆకుల మీనాకుమారి (35) కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తోంది. కాగా పదేళ్ల క్రితం విభేదాలు వచ్చి భార్యభర్తలు విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. మీనాకుమారి తాపీ పనిలో కూలీగా వెళ్తూ తన బిడ్డలను పోషించుకుంటోంది. ఈ క్రమంలో స్థానిక రామకృష్ణారావుపేటకు చెందిన 42ఏళ్ల సబ్బి రాంబాబురెడ్డితో ఐదేళ్లక్రితం ఆమెకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధంగా మారింది. అతడు కూడా తన భార్యతో విభేదించి రామకృష్ణారావుపేటలో తన తల్లితో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇద్దరూ ఒకరింటికి ఇంకొకరు రాకపోకలు సాగిస్తున్నారు. నెల రోజుల నుంచి మీనాకుమారి వద్దకు వేరే వ్యక్తి రావడాన్ని రాంబాబురెడ్డి గమనించాడు. ఈ క్రమంలో ఆమె 3రోజుల క్రితం తన సెల్‌ఫోన్‌ను స్విచ్‌ఆఫ్ చేసింది. దీంతో రాంబాబురెడ్డి ఆమెకు ఫోన్ చేసి.. చేసి.. సహనం కోల్పోయాడు. ఎట్టకేలకు ఆమె ఆదివారం సెల్‌ఫోన్‌ను స్విచ్‌ఆన్ చేసింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య ఫోన్‌లో గొడవ జరిగింది. అనంతరం మీనాకుమారి నేరుగా రామకృష్ణారావుపేట రాంబాబురెడ్డి ఇంటికి వెళ్లింది. అక్కడ ఇద్దరి మధ్య తారాస్థాయిలో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో అతడు క్షణికావేశంలో ఇనుపరాడ్‌తో ఆమె తలపై మోదాడు. దీంతో తీవ్ర రక్తస్రావంతో పడిఉన్న ఆమెను స్థానికులు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. కాకినాడ టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రమత్తులో ట్రక్కు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఊబలంక వాసిగా గుర్తింపు



అప్పారావు (ఫైల్)

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి ఊబలంక గ్రామానికి చెందిన మల్లిడి అప్పారావు (63)గా గుర్తించినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎంవివి.సత్యనారాయణ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన మల్లిడి అప్పారావు మరికొంతమందితో కలిసి చేపలవేటకు ఈనెల 6వ తేదీన ఇంటి నుంచి బయలుదేరి తెలంగాణ రాష్ట్రం భద్రాచలం జిల్లా మణుగూరు వెళ్లారు. అక్కడ చెరువులో చేపలు పట్టి పని పూర్తికావడంతో మధ్యాహ్నం బడాదోస్తు ట్రక్కు వాహనంలో వలలు ఎక్కించుకుని నలుగురు వ్యక్తులు ఇంటికి బయలుదేరారు. ట్రక్కులో వలలపై పడుకున్న అప్పారావు కొవ్వూరు ఏషియన్ పేయింట్స్ గొడౌన్ సమీపానికి వచ్చేసరికి శనివారం రాత్రి వాహనం నుంచి కిందపడిపోయాడు. అప్పారావు పైనుంచి అనేక వాహనాలు వెళ్లిపోవడంతో మృతదేహం ముక్కలు అయిపోయి చెల్లాచెదురుగా పడింది. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ముక్కలు అయిపోయిన మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇది గమనించకుండా మిగిలినవారు ట్రక్కులో ఊబలంక వెళ్లిపోయారు. అక్కడ చూసుకుని అప్పారావు లేకపోవడంతో మళ్లీ అదే వాహణంలో వెనక్కి వెతుక్కుంటూ వచ్చారు. కొవ్వూరు ఏషియన్ పేయింట్స్ గొడౌన్‌వద్ద ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడని తెలిసి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. మృతదేహం వద్ద ఉన్న దుస్తుల ఆధారంగా మల్లిడి అప్పారావు (63)గా గుర్తించారు. మృతుడి అల్లుడు పెసంగి మోసేరాజు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ ఎంవివి. సత్యనారాయణ తెలిపారు.

తాండవ నదిలో యువకుడి గల్లంతు

తుని రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం రేఖవానిపాలెనికి చెందిన గెడ్డం సాయి(23) శనివారం ఉదయం కాలు జారి తాండవ నదిలో గల్లంతయ్యాడు. స్థానికులు సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం వెలికితీత చర్యలు ముమ్మరం కాకపోవడంతో సాయి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగావిలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి

ట్రాక్టర్ కింద పడి తీవ్రగాయాలు

మార్గమధ్యలో కూతురు... ఆసుపత్రిలో తల్లి దుర్మరణం

గోపాలపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతిచెందారు. ఏలూరు జిల్లా పోలవరం మండలం బండార్లగూడెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీటీచర్ కురసాని కాంతమ్మ (45) ఆదివారం తల్లి కవలం గన్నమ్మ (75)ను తీసుకుని స్కూటీపై దొండపూడి నుంచి కుంకాల వైపు వెళుతున్నారు. దొండపూడి వద్ద తల్లీకుమార్తె ప్రయాణిస్తున్న స్కూటీ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ కిందపడి తీవ్రగాయాలపాలయ్యారు. స్థానికులు గమనించి వెంటనే 108 వాహనంలో ఎల్లండీపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కాంతమ్మ మృతి చెందింది. అనంతరం తల్లి కవలం గన్నమ్మను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆమె మృతి చెందింది. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు స్థానికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తల్లీకూతురు మృతిచెందడంతో బండార్లగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఊర చెరువులో పడి వ్యక్తి మృతి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

అనపర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం కుతుకులూరు ఊర చెరువులో పడి అనపర్తికి చెందిన దొడ్డ మధుకుమార్ (54) మృతిచెందాడు. అనపర్తి ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తికి చెందిన దొడ్డ మధుకుమార్ గత కొన్నేళ్లుగా అనపర్తిలోని నివాసం ఉంటూ ప్రైవేటుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి కుతుకులూరులోని ఊర చెరువు సమీపంలో తన మిత్రులతో కలిసి మద్యం తాగాడు. మద్యం మత్తులో ఉన్న మధుకుమార్ సమీపంలోని ఊర చెరువులో పడి మృతిచెందాడు. ఆదివారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు మధుకుమార్ బంధువులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మండపేటకు చెందిన మధుకుమార్ కొంతకాలం కుతుకులూరులో నివాసం ఉండగా ప్రస్తుతం అనపర్తిలోని నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి ఏమి జరిగిందన్న అంశంపై విచారణ నిర్వహిస్తున్నామని, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారరు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు అనపర్తి ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం



సామర్లకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్ పరిధిలో మూడవ నంబరు ట్రాక్ వద్ద సుమారు 30 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని సామర్లకోట రైల్వే పోలీసులు ఆదివారం గుర్తించారు. గూడ్స్ రైలు లోకోపైలట్ అందించిన సమాచారంతో సామర్లకోట రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహం ఎడమచేతిపై పి.నాగేశ్వరరావు, లోవ అనే పేర్లు.. కుడిచేతి దండపై సూర్యుడి గుర్తు, ఎడమ చేతిపై పాము ఆకారములో పచ్చ బొట్టులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. సామర్లకోట రైల్వే పోలీస్టేషన్ ఇంచార్జి పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

రాష్ట్ర కాంట్రాక్టర్స్, బిల్డర్స్ జిల్లా కార్యవర్గం



డైరీని కోనేరు మురళీకృష్ణసాయికి అందిస్తున్న కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్టేట్ కాంట్రాక్టర్స్, బిల్డర్స్ అసోసియేషన్ తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాజమహేంద్రవరం రిషిత గ్రాండ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కాంట్రాక్టర్స్ బిల్డర్స్ జిల్లా అసోసియేషన్ గౌరవ చైర్మన్‌గా కోనేరు మురళీకృష్ణసాయి, గౌరవ అధ్యక్షుడిగా మేడ ప్రసాద్, అధ్యక్షుడిగా మద్దాల ధర్మాజీరావు, కార్యదర్శిగా దాట్ల సూర్యనారాయణరాజు, ఉపాధ్యక్షులుగా కేవీ.రామారావు, జి.రాంగారావు, స్టేట్ ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా ముత్యాల శ్రీనివాసరావు, సలహాదారులుగా కొమ్మిన వెంకటేశ్వరరావు ,నంది విజయకుమార్‌బాబు, సంయుక్త కార్యదర్శులుగా ఎన్.శివ రామకృష్ణ, ఎస్కె.జిలాని, ఉదయ భాస్కరరావు, కోశాధికారిగా ఎన్.గోపాల కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా కడియాల వెంకటేశ్వరరావు, చల్లా సురేష్ కుమార్, బి.అప్పారావు, టి.కొండలరావు, కె.మురళీమోహన్. కేఎన్‌వీ.ప్రసాద్, కె.కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. ఈనెల 29న కర్నూలులో జరిగే రాష్ట్ర సభ్యా డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి సభ్యులంతా హజరుకావాలని తీర్మానం చేశారు.

రూ.27 వేలు పలికిన సుబ్రహ్మణ్యేశ్వరుడి లడ్డూ



వెంకటరామారెడ్డికి లడ్డూ అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అనపర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనపర్తి వీర్రాజు మామిడివద్ద ఉన్న కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. షష్ఠి మహోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తుడు సమర్పించిన ఐదు కిలోల లడ్డూకు వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన కొవ్వూరి వెంకటరామారెడ్డి(దొరబాబు) రూ.27వేలకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు దొరబాబుకు లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. అన్న సమారాధన సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

పేపరుమిల్లు విశ్రాంత అధికారుల ఆత్మీయ సమావేశం



పేపరుమిల్లు విశ్రాంత అధికారి రాధాకృష్ణను సత్కరిస్తున్న రిటైర్డ్ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ఏపీ పేపరుమిల్లు రిటైర్డ్ ఆఫీసర్స్ ఎంప్లాయిస్, విశ్రాంత అధికారుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్‌రీజెన్సీలో ఆదివారం రిటైర్డ్ అధికారి ఎస్.రాధాకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. 1964 నుంచి మిల్లులో అధికారులుగా పనిచేసి పదవీ విరమణ పొందిన వారు వారి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గత 60 ఏళ్ళుగా పేపరుమిల్లు అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించిందని గుర్తుచేసుకున్నారు. రాధాకృష్ణను విశ్రాంత అధికారుల సంఘం ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధికారులు బీసీ.బెనర్జీ, దేబ్ ,కేసీ, ఈరన్న, పీకే గుప్తా, వి.కృష్ణమోహన్, ఎస్కే. శాస్త్రి, సీఎస్ వెంకట్రావు, ఏ.కనకరాజు, తాతారెడ్డి, పీఎస్.రావు, కాశీ విశ్వనాధరావు, టీకే విశ్వేశ్వరరెడ్డి ,ఎంఆర్ఎల్ శర్మ పాల్గొన్నారు.





పైప్‌లైన్ లీకవడంతో వృథాగా పోతున్న నీరు. పక్క చిత్రంలో పైప్‌లైన్ లీకేజీతో రోడ్డు పైకి వచ్చేస్తున్న నీరు

మంచినీటి పైప్‌లైన్‌లో లీకులు

• వృథాగా పోతున్న మంచినీరు • పట్టించుకోని పంచాయతీ అధికారులు

సీతానగరం, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): వెలమపేటలో పంచాయతీ మంచినీటి పైప్‌లైన్‌కు రెండుచోట్ల లీకులు పడడంతో మంచినీరు వృథాగా పోతోంది. తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన పంచాయతీ అధికారులు దీనిపై పట్టించుకోవడం లేదని స్థానికులు తమ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికులు మాట్లాడుతూ ఈ లీకేజీల వల్ల మంచినీరు కలుషితమై అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. రోడ్ల పైకి మంచినీరు చేరి రోడ్లు జలమయవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ యంత్రాంగం స్పందించి పగిలిన పైప్‌లైన్‌లను సరిచేయాలని కోరుతున్నారు. నీరు వృథా కాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు

మద్యం షాపు తరలించాలని ఆందోళన



శెట్టిబలిజపేట మద్యం షాపు వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

సీతానగరం, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక శెట్టిబలిజపేట వద్దనున్న మద్యం దుకాణాన్ని తొలగించి వేరే చోట ఏర్పాటు చేసుకోవాలని కోరుతూ ఆదివారం స్థానిక మహిళలు ఆందోళన చేశారు. మద్యం షాపు వద్ద తోలేటి దుర్గ, తోలేటి మాధవి, బైర్రాజు రామలక్ష్మి, బైర్రాజు అరుణ, కొక్కిర్లపాటి పద్మ తదితర మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల మధ్య మద్యం షాపు ఉండటం వల్ల మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు. వీరి ఆందోళనలకు పలువురు మద్దతు పలికారు. కొంతసేపటి తర్వాత ఆందోళన విరమించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

నల్లజర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న ముత్యాలమ్మ చెరువులో పడి చోడవరం గ్రా మానికి చెందిన మద్దిపాటి సూరిబాబు(50)మృతి చెందినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారంరాత్రి నల్లజర్లకు చెందిన దుగ్గిన లీలాకృష్ణ కుమారుడు పెళ్లికి వీరంపాలెం పంతులుతో కలిసి రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి చోడవరంలో వీరంపాలెం పంతులు కారు దిగి తన బైక్‌పై ఫోన్ మాట్లాడుకుంటూ నల్లజర్ల ముత్యాలమ్మ చెరువు వద్దకు వచ్చి బహిర్భూమికి వెళ్లి కాలు జారి చెరువులో పడినట్లు సూరిబాబు చెప్పలు,బైక్‌నుబట్టి గుర్తించారు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కోడిపందాలు నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తూ డబ్బు బెట్టింగ్‌గా పెట్టి, కోళ్ళకు కత్తులు కట్టి కోడిపందాలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు మండలం వేములూరు గ్రామశివారులో ఆదివారం వేములూరుకు చెందిన ప్రగడ సత్యనారాయణ, ఆరికిరేవులకు చెందిన రావూరి శ్యామ్‌లు ఇద్దరు కోడిపందాలు నిర్వహిస్తుండగా దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్దను ంచి రూ.1000నగదు, ఒక కోడికత్తి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ విశ్వం తెలిపారు.

12 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ఉండ్రాజవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 12వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపారు. గ్రామస్థాయిలో భూములకు సంబంధించి అన్ని సమస్యలను పరిష్కరించాలనే ప్రాథమిక లక్ష్యంతో ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తోందని ఆయన తెలిపారు.



వ్యర్థాలతో నిండిన ఆవ రోడ్డు దుస్థితి

ఇదీ రోడ్డా! డంపింగ్ యార్డా?

● ఆవ 100 అడుగులరోడ్డు దుస్థితి ఇది ● పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎంతో ప్రాధాన్యం ఉన్న రోడ్డును డంపింగ్ యార్డుగా మార్చేశారు.. పట్టణంలోని వ్యర్థాలను తెచ్చి రోడ్డు పక్కనే పడేస్తున్నారు. ఇదెక్కడో మా రుమూల కాదు సుమా..ఇది అనేక ఏళ్లుగా కలలుగన్న రోడ్డు.ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ట్రాఫిక్ తగ్గించడానికి ప్రత్యామ్నాయంగా నిర్మించిన ఆవ రోడ్డు.2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ రోడ్డును శాంక్షన్ చేసి భూసేకరణ చేసి చాలా వరకూ నిర్మాణం చేసింది.గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తయింది. మోరంపూడి నుంచి ఈ రోడ్డు మీదుగా తూర్పు రైల్వే స్టేషన్‌కు వెళ్ల డం ఈజీ. అంతే కాకుండా సిటీలోని వాహనాలు షెల్టాన్, తాడితోట, వేంకటేశ్వర హోల్‌సేల్ మార్కెట్ నుంచి ఈ రోడ్డులో సులభంగా రావొ చ్చు. పైగా ఫోర్‌లైన్‌తో సెంట్రల్ లైటింగ్‌తో నిర్మిం చిన రోడ్డు పరిస్థితి ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. డంపింగ్ యార్డులా తయారు చేశారు. రోడ్డుకు ఇరువైపులా చెత్త వేస్తున్నారు. ఈ రోడ్డును డంపింగ్ యార్డులా తయారు చేశారు. దీంతో రోడ్డుమీద పయనమే నరకంగా మారింది. రోడ్డంతా బాగున్నా చెత్త వల్ల కంపు కొట్టడంతో పాటు, చూడడానికి అసహ్యంగా ఉండడంతో ఈ రోడ్డుపై వెళ్లడానికి ఎవరూ ఇష్టపడడంలేదు.



టీటీ క్రీడాకారుడికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి సాయం



క్రీడాకారుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడికి రాజమహేంద్రవ రం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ భవాని చారిటబుల్ ట్రస్ట్‌ద్వారా ఆర్థిక సాయం అందించారు. తన కార్యాలయంలో ఆదివారం క్రీడాకారుడిని ప్రోత్సహిస్తూ ఆర్థిక సాయం అందజేసి మాట్లాడారు. భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిత్యం ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా నగరంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంనునిర్మించనున్నట్లు చెప్పారు.

చంద్రబాబుపై విమర్శలు చేస్తే ఊరుకోం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై ఇష్టానుసారం విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ హెచ్చరించారు.ఈ మేరకు ఆదివారం రాజమహేంద్రవరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమిలో భాగమైన టీడీపీ, జనసేన పార్టీ మధ్య విభేదాలు సృష్టించి మనుగడ కాపాడుకోవాలని వైసీపీ నేతలు కుట్ర పూరిత ఆలోచనలు చేస్తున్నారని దినిని తిప్పికొడతామన్నారు.రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ అధికారాన్ని ప్రజలు పీకేశారన్నారు. జగన్ హయాంలో జరిగిన అక్రమాలకు సమాధానం చెప్పడానికి సిద్ధం కావాలని సూచించారు.

పందిరి మహాదేవుడు వర్ధంతి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కోటిలింగాలపేటలోని పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రంలో ఆదివారం సంస్థ వ్యవస్థాపకుడైన పందిరి మహాదేవుడు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. స్మార్త అధ్యాపకులచే వేద మంత్రోశ్చరణలతో పూజ ప్రారంభించి వర్ధంతి సభ నిర్వహించారు. సహాయ కమిషనర్ విశ్వనాథ రాజు మాట్లాడుతూ వ్యవస్థాపకుల ఆశయాలకు అనుగుణంగా పేదలకు సేవ చేయడం జరుగుతున్నదన్నారు. స్మార్త అధ్యాపకులకు వస్త్ర సత్కారం చేశారు. పేదలకు దుప్పట్లు పంచిపెట్టారు. అన్నదానం చేశారు. కలప అడితి వ్యాపారులు, స్థానికులు పాల్గొన్నారు.

రబీ సీజన్‌కు రైతులు సిద్ధం

● ముమ్మరంగా దమ్ములు

కోరుకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):కోరుకొండ మండలం రబీ సీజన్‌కు రైతులు సిద్ధమయ్యారు. మండలంలో శ్రీరంగపట్నం, రాఘవాపురం, కోరుకొండ, మునగాల, బూరుగుపూడి తదితర గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ పూర్తిచేసిన రైతాంగం రబీలో వరి సాగు చేసేందుకు ముమ్మరంగా దమ్ములు చేస్తున్నారు. వృథాగా పోయే నీటిని పొలాలకు మళ్లించి ట్రాక్టర్లతో దమ్ము చేస్తున్నారు. పుష్కర ఆయకట్టు కింద చెరువులకు వచ్చేనీటి ఆధారంగా గత నాలుగు సంవత్సరాలుగా మెట్ట రైతాంగం రబీలో వరి సాగు చేస్తున్నారు. గోదావరిలోకి వృథాగా పోయే నీటిని ఒడిసి పట్టుకుని రబీ వ్యవసాయం సాగుచేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలకు ముందు కోరుకొండ మండలాల్లో ఒకటి రెండు గ్రామాల్లో తప్ప రబీలో వరిసాగు చేసే వారు కాదు. ఇటీవల కాలంలో తేలికపాటి వరి వంగడాలు అందుబాటులోకి రావడంతో కేవలం 75రోజుల్లో పంట చేతికి వచ్చే రకాలను ముందుగా సాగుచేస్తున్నారు. నవంబరులోనే కోతలకు రావడంతో రెండో పంటకోసం వరి పొలాలు సిద్ధం చేస్తున్నారు. గతంలోనే మినుము, పెసర అపరాలు రబీలో పండించే వారు మినుము, పెసర సరిగా పండకపోవడంతో రబీలో వరిసాగు చేస్తున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో రబీ వరినాట్లు ప్రారంభమయ్యాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో మరికొందరు రైతులు ఖరీఫ్ పంటను కోయలేకపోయారు. తుఫాన్ హెచ్చరికల కారణంగా గత 10రోజులుగా కోతలు ఆగిపోయాయి. వ్యవసాయశాఖ కూడా వరికోతలు కోయవద్దని హెచ్చరికలు జారీ చేయడంతో రైతాంగం రబీపై దృష్టి సారిస్తున్నారు.



మండలంలో రబీ వరినాట్లు వేస్తున్న దృశ్యం

హైందవ శంఖారావానికి 500 మంది హాజరు

దివాన్‌చెరువు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడలో వచ్చేనెల 5న జరిగే హైందవ శంఖారావం సభకు దివాన్‌చెరువు నుంచి 500 మంది వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు మండల కన్వీనర్ గ్రంధి గణేష్‌గుప్త తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరుతూ దివాన్‌చెరువు గ్రామ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. గ్రామ ప్రముఖ్‌గా వీరాతి నాగు, బస్ ప్రముఖ్‌గా జనపరెడ్డి ప్రసాద్, గ్రామ బృందంగా గాంగేయుడు, నీలపాల శివ, పలివెల నవీన్ నియమితులయ్యారని తెలిపారు. జిల్లా సమరసత కార్యవాహకులు కర్రి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ధవళేశ్వరం ఖండ కార్యవాహ్ సత్యనారాయణరాజు, శ్రీను పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామ పరిధిలోని మల్లయ్యపేట 132/33 కేవి సబ్‌స్టేషన్, 33/11కేవి కొంతమూరు, తొర్రేడు గ్రామంలో 33/11 కేవి జెహెచ్‌సీ పరిధిలో స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం పలు ప్రాంతాలకు సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని రాజమహేంద్రవరం ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొంతమూరు నూకాలమ్మగుడి ప్రాంతం, ముస్లింపేట, అంబేడ్కర్‌పేట, ఆఫీషియల్ కాలనీ, పంచాయతీ ప్రాంతం, కాతేరు రోడ్డు, బ్రాహ్మణ అగ్రహారం, బూషం కాలనీ, శ్రీరామ్‌నగర్, బీసీ కాలనీ, వీవీ కొండయ్య నగర్, కాతేరు గ్రామంలోని బ్రాహ్మణ అగ్రహారం, కల్యాణ్‌నగర్, ఆదర్శనగర్, ఎంప్లాయిస్ కాలనీ, జంగాలకాలనీ, బీసీ కాలనీ, శేషాద్రి లేఅవుట్, క్వారీ ఏరియా, 4వ బ్రిడ్జి సాయిరాం కాలనీ, బొమ్మన కాలనీ, పరిమినగర్, ఎన్‌వీబీ కాలనీ, కోలమూరు, రాయుడుపాకలు, తిరుమల కాలేజీ ప్రాంతం, సీతానగరం రోడ్డు, తొర్రేడు, వెంకటనగర ప్రాంతాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

నాగసర్ప పూజ

చాగల్లు, డిశంబరు 8 (ఆంధ్రజ్యోతి) స్థానిక సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామివారి ఆలయంలో నాగసర్ప పూజా కార్యక్రమం జరిగింది. వేదపండితులు లింగాల శ్రీనివాసశర్మ, చెరుకూరి శివ సీతారామ్, పండిత పురోహితులు మంత్రోచ్చరణలతో పూజలు జరిగాయి. గ్రామ సుభిక్షం కోసం, సర్పదోష నివారణ కోసం ఈపూజ నిర్వహించినట్లు తెలిపారు. ఆళ్ళ మోహనరావు దంపతులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.





దివాన్‌చెరువు సుబ్రహ్మణ్య ఆలయంలో హోమం చేస్తున్న నందూరి సుబ్బారావు తదితరులు. పక్క చిత్రంలో బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠిలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

భక్తి శ్రద్ధలతో హోమాలు

దివాన్‌చెరువు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): షష్ఠి ఉత్సవాల్లో భాగంగా లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం ఉదయం ప్రత్యేక హోమాలు, పూర్ణాహుతి జరిగింది. ఆలయ ధర్మకర్త నందూరి సుబ్బారావు ఆధ్వర్యంలో జరుగుతున్న షష్ఠి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి మూలమంత్ర పూర్వక హోమం, సరస్వతి, లక్ష్మి, ధన్వంతరి, సరస్వతి, రుద్రహోమాలు జరిపారు. అనంతరం పూర్ణాహుతి జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు తుట్టగుంట అజయ్ శర్మ, అర్చకుడు పొక్కులూరి రవిశర్మ బహ్మత్వంలో హోమాలు జరిగాయి. నండూరి సుబ్బారావు, సత్యవతీదేవి దంపతులు, మేడూరి సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, వెంకటరమణ, వాకచర్ల కృష్ణ దంపతులు ఆంజనేయశాస్త్రి చేతుల మీదుగా వేదపండితులు ఈ హోమాన్ని జరిపించారు. వీధుల్లో స్వామి వారి పల్లకీ ఊరేగింపు జరిగింది. హోమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. మాజీ సర్పంచ్ మెట్ల ఏసుపాదం, ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు సహాయ కార్యక్రమాలు అందించారు. ఈ సందర్భంగా నండూరి మాట్లాడుతూ మంగళవారం ఉదయం సుబ్రహ్మణ్యస్వామి ఆరాధకుడు పళనిస్వామిచే సుబ్రహ్మణ్యతత్వ వైభవంపై ఉపన్యాసం ఉంటుందని తెలిపారు.



కోరుకొండ: నర్సాపురంలో కోనేటి మధ్యన ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రెండో రోజున షష్ఠి ఉత్సవాలు

కోరుకొండ: సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ఆలయానికి భక్తుల తాకిడి నెలకొంది. కోరుకొండ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి జరిగే బస్టాండ్ ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. కాపవరం సెంటర్ నుంచి జంబూపట్నం తానా సెంటర్ వరకు భక్తులతో నిండిపోయింది. ఇటీవల నర్సాపురంలోని దేవుని కోనేరు మధ్యన 18 అడుగుల ఎత్తున ఏర్పాటు చేసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని చూసేందుకు వచ్చిన భక్తులతో సందడి నెలకొంది.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు

బిక్కవోలు: సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన షష్ఠి కళావేదిక బిక్కవోలుకు చెందిన కూచిపూడి కళాధామం చిన్నారుల కూచిపూడి నృత్యాలు అలరించాయి. నాట్యాచారిణి పిల్లి జాహ్నవి ఆధ్వర్యంలో చిన్నారులు విఘ్నం రాజే భజే, మూషిక వాహన, నటన మాడెనే హరుడు, బ్రహ్మాంజలి, పలుకే బంగారమాయనే, అష్ట లక్ష్మీస్తుతి, భరవేదమునే, నవదుర్గా స్తుతి, నీరాజనం, శివ కల్యాణం బాలేతో ముగించారు. చిన్నారులకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి మొమెంటో అందించి గురువు జాహ్నవిని సత్కరించారు.

పెళ్లి కానుకను సద్వినియోగం చేసుకోండి

గోవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా వధువుకు అందిస్తున్న పెళ్లి కానుకను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకులు మంగరౌతు రాము, ఉంగరాల రాము అన్నారు. మండలంలోని అచ్చుతాపురం గ్రామంలో చిటికెన భవాని, మట్టా సురేష్ దంపతులను వారు ఆశీర్వదించి రూ.20,000 విలువైన పెళ్లి కానుక చెక్కు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదంటి వధువుల కళ్ళల్లో ఆనందం చూసేందుకే నెహ్రూ ఫౌండేషన్ ఏర్పాటు చేసి తద్వారా కొంతమేర ఆర్థికంగా చేయూత అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగులపాటి నారా యణ కుమార్, ఈది అశోక్, చిటికెన సత్యనారాయణ, అయినం నాగేశ్వరరావు, లంక పెద వెంకన్న, కొత్తపల్లి సత్యనారాయణ, నారా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



వధువుకు పెళ్లి కానుక చెక్కును అందిస్తున్న టీడీపీ నాయకులు

వీఆర్ఏ మృతికి సంతాపం



సత్యవతి (ఫైల్‌ఫొటో)

రంగంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం వెంకటాపురం గ్రామం రెవెన్యూ సహాయకురాలు మామిడాడ సత్యవతి (59) ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో ఇంటి వద్ద మృతి చెం దారు. సమాచారం తెలిసిన వెంటనే రంగంపేట తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామరెవెన్యూ అధికారులు, రెవెన్యూ సహాయకులు మృతురాలి ఇంటికి వెళ్ళి ఆమె భౌతికాయానికి నివాళులర్పించారు. ప్రభుత్వం నుంచి వచ్చే దహన సంస్కార ఖర్చుల నిమిత్తం రూ. 25,000 ఆమె కుమారుడు మామిడాడ వెంకటేశులుకు అందించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, మండలంలో వివిధ గ్రామాల వీఆర్వోలు, మండల వీఆర్ఏల ప్రెసిడెంట్ ఇందుగుమిల్లి సుబ్బారావు, సెక్రటరీ పి.వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



ఇదీ రాజమహేంద్రవరం ఆవ రోడ్డులోని ఒక డ్రెయినేజీ పరిస్థితి..దీనిని బట్టి ఎంత ప్లాస్టిక్ వాడుతున్నామో ఇట్టే చెప్పేయవచ్చు.. ఒక్కసారి ఈ డ్రెయినేజీని తీక్షణగా చూడండి.. అందులో ఏం కనిపిస్తున్నాయో.. అన్నీ కవర్లు.. వాటర్ బాటిల్స్.. అంతా ప్లాస్టిక్.. ఏదైనా గుడ్డ సంచి అయితే తడిచి నేలలో కలిసిపోయేది.. ప్లాస్టిక్ కావడంతో అది మునగదు.. మురుగు నీటిని ముందుకు పోనీయదు.. ఎక్కడికక్కడ అడ్డుపడుతూనే ఉంటుంది.. అందుకే ఇకనైనా మారండి.. ప్లాస్టిక్ సంచిని వదిలేసి గుడ్డ సంచివాడండి!



కాకినాడ జేఎన్‌టీయూలో ఎమ్మెల్సీ కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

మా..స్టారొస్తారు!

ఎమ్మెల్సీ ఫలితం తేలేది నేడే

- ఉదయం 8 నుంచి లెక్కింపు
- బరిలో ఐదుగురు అభ్యర్థులు
- ఇద్దరి మధ్య ప్రధాన పోటీ
- పోలైన ఓట్లు 15,490
- బ్యాలెట్ పద్ధతిన లెక్కింపు
- ఆలస్యంగా రానున్న ఫలితం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మా..స్టారెవరో మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.. ఇప్పటికే ఫలితం బాక్సుల్లో భద్రంగా ఉంది.. నేటి లెక్కింపుతో ఉత్కంఠకు తెరపడుతుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపు కాకినాడ జెఎన్‌టీయూలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఆరంభమవుతుంది. బ్యాలెట్ పత్రాల లెక్కింపు వల్ల కౌంటింగ్ కాస్త నెమ్మదిగా జరగవచ్చు.ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో మొత్తం 16,737 మంది ఓటర్లు ఉండగా 15,502 ఓట్లు పోలయ్యాయి.అది 92.62 శాతంగా ప్రకటించారు. కానీ ఈ రోజు ప్రకటనలో పోలైన ఓట్లు 15,490గా చెబుతున్నారు.12 ఓట్లు తేడా వచ్చింది.యూటీఎఫ్‌కు చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ గతేడాది ఉండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో మొత్తం ఐదు గురు అభ్యర్థులు స్వతంత్రంగా పోటీపడ్డారు. యూటీఎఫ్ నేత బొర్రా గోపిమూర్తి, గంధం నారాయణరావు, పులుగు దీపక్, డా.కవల నాగేశ్వరరావు, నామన వెంకటలక్ష్మి(విశ్వ లక్ష్మి) పోటీ పడ్డారు. కానీ పోటీ ప్రధానంగా బొర్రా గోపీమూర్తి,గంధం నారాయణరావు మధ్యే ఉంటుందనే ఆయా వర్గాల కథనం. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువగా గోపీమూర్తికి వేయగా, ప్రైవేట్ స్కూళ్ల నుంచి నారాయణరావుకు ఓట్లు బాగా పడినట్టు ప్రచారం జరుగుతోంది. ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికలంటే చాలా ప్రాధాన్యత ఉంటుంది. గతంలో కార్పొరేట్ విద్యాసంస్థల యజమానులు పోటీ చేసి గెలిచిన సందర్భాలు ఉన్నాయి.ఈ సారి పోటీ రసవత్తరంగానే సాగినట్టు చెప్పవచ్చు. మిగతా అభ్యర్థులు కొంతమేర ఓట్లను చీల్చే అవకాశం ఉంది. వైసీపీ ఐదేళ్లలో టీచర్ల నోళ్లను వైసీపీ ప్రభుత్వం నొక్కేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శాసన మండలిలో తమ తరపున మాట్లాడడానికి ఉపాధ్యాయ వృత్తి నుంచి వచ్చిన ఉద్యమ నేతకే పట్టం కట్టాలని కొన్ని సంఘాలు భావించాయి.ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులను పోటీకి పెట్టలేదు. ఇక్కడ సీపీఐ మాత్రం ఎస్టీయు సంఘం తరపున గంధం నారాయణరావుకు సపోర్టు చేయడం గమనార్హం. పార్టీలకతీతంగా ఎన్నికలు జరగడంతో పెద్దగా ప్రచార ఆర్భాటం కనిపించని సంగతి తెలిసిందే.గెలుపు ఎవరిదనే దానిపై ఎవరి ధీమా వారికి ఉంది.

14 టేబుళ్లపై.. 9 రౌండ్లలో లెక్కింపు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఆర్వో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 5న తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గం సంబంధించిన పోలింగ్ ప్రక్రియ జరిగిందన్నారు. ఈ పోలింగ్ ప్రక్రియలో 15,490 ఓట్లు నమోదయ్యాయన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో భద్రపరిచామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామన్నారు.కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఉదయం 6గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. 14 టేబుళ్లపై 9రౌండ్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. తొలిదశలో ప్రాథమిక ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం డీటెయిల్డ్ కౌంటింగ్ నిర్వహించామన్నారు.

కౌంటింగ్‌కు డ్రోన్ కెమెరాలతో పటిష్ట నిఘా : ఎస్పీ



స్ట్రాంగ్ రూమ్ పరిశీలిస్తున్న ఎస్పీ

కాకినాడక్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ కాకినాడ జేఎన్‌టీయూకేలో ఆదివారం పరిశీలించారు.ఇన్, అవుట్ గేట్ల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణును ఆదేశించారు. ఎలక్షన్ అధికారులు,పోలింగ్ ఏజెంట్ల సెల్‌ఫోన్లను బయట సెల్‌ఫోన్ కౌంటర్లలో జమ చేసి లోనికి వెళ్లాలని సూచించారు. కౌంటింగ్ నిర్వహించే భవనాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను కూడా పరిశీలించారు. జేఎన్‌టీయూకే ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో వాహనాలను పార్క్ చేసి కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, సర్పవరం సీఐ బి.పెద్దిరాజు, ట్రాఫిక్-2 సీఐ డి.రామారావు ఉన్నారు.

పోలీసులమని భయపెట్టి.. రూ.4.15 లక్షలు లాగేశారు!

రాజమహేంద్రవరంలో సైబర్ మోసం - వన్‌టౌన్‌లో కేసు నమోదు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : ముంబై క్రైమ్ పోలీసులుపేరుతో భయపెట్టి రాజమహేంద్రవరానికి చెందిన ఒక వ్యక్తి నుంచి రూ.4.15 లక్షలు దోచిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వన్‌టౌన్ పోలీసులు కథనం ప్రకారం. గత నెల 12న రాజమహేంద్రవరం జాంపేటకు చెందిన కె.ఆదిత్య ఫోన్‌కు ఒక కాల్ వచ్చింది. ఆ కాల్‌లో మాట్లాడిన వారు తాము ముంబై క్రైమ్ పోలీసులమని.. నీ అకౌంట్ నుంచి మనీలాండరింగ్ జరుగుతుందని నువ్వేం చేస్తున్నావని భయపెట్టారు. తనకు సంబంధంలేదని బాధితుడు చెప్పినా వినకుండా కాల్ కట్ చేసి వీడియోకాల్ చేసి పోలీస్ యూనిఫాంలో మాట్లాడారు. నీ అకౌంట్లు డిజిటల్ అరెస్టు చేశామని నిన్ను కూడా ఆదుపులోకి తీసుకుంటామని భయపెట్టడంతో ఆదిత్య హడలిపోయాడు. తనకు ఏవిధమైన సంబంధంలేదని సమాధానం ఇచ్చాడు. అయినా అవతల వ్యక్తి భయపెట్టి నిన్ను రక్షిస్తామని నీఅకౌంట్‌లో డబ్బును తాము చెప్పిన అకౌంట్‌కు జమచేయాలని చెప్పడంతో ఆలోచించకుండా రూ.4.15 లక్షలు అకౌంట్ ట్రాన్స్‌ఫర్ చేసేశాడు.కొద్ది రోజుల తర్వాత డిజిటల్ అరెస్టు అనేదానిపై ఆరా తీశాడు.అటువంటిది ఉండదని తెలుసుకున్న ఆదిత్య తాను మోసపోయానని గ్రహించి ఐటీ పోలీస్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. కేసును వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదలాయించడంతో ఆదివారం కేసు నమోదు చేశారు.



విశాఖపట్నంలో వైశాఖేశ్వర స్వామి దేవస్థానానికి దాతలు ఒక ఆవును ఇచ్చారు.. ఆ ఆవు ఆశ్రమానికి వచ్చినప్పటి నుంచి మేత తినడంలేదు.. దీంతో ఆ ఆలయ సిబ్బంది పశువైద్యాధి కారులకు సమాచారం ఇచ్చారు.. వారు వచ్చి ఆవు పొట్టలోపల పరిశీలించి ఇంక బతకదని చెప్పారు.. ఎందుకని అడిగితే.. లోపలంతా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉన్నాయని చెప్పారు.. మనం ఏం కావాల్సిన ప్లాస్టిక్ కవర్లలోనే తెచ్చుకుంటున్నాం.. ఆ తరువాత వాటిని ఇష్టానుసారం పాడేస్తున్నాం.. ఆ ప్లాస్టిక్ కవర్లు ఆవులు తింటున్నాయి.. కుక్కలు తింటున్నాయి.. పక్షులు తింటున్నాయి.. అరగక చచ్చిపోతున్నాయి.. అది మనకు పాపమే కదా.. అందుకే ఇక నుంచి ప్లాస్టిక్ కవర్లు వదిలేద్దాం..గుడ్డ సంచిని వాడండి..అలాగని ఈనాడే ఒక ప్రతిజ్ఞ చేయండి.. ఇక గుడ్డ సంచినే వాడాలని ప్రవచనకర్త గరికపాటి సూచించారు..!?

ప్రమాదమన్నా పట్టించుకోవడంలేదు.. వదిలేయమన్నా వదలడం లేదు.. మన ఒక్కరితో పోయేదా అంటే అదీ కాదు.. ఖాళీ చేతులతో మార్కెట్‌కి వెళ్లడం.. కవర్లతో తిరిగిరావడం.. అందులోవి తీసి ప్లాస్టిక్ కవర్లు బయటపారేయడం.. ఎవరేమైపోతే మాకేం అనుకుంటున్నారు.. మీకూ ప్రమాదమన్నా పట్టించుకోవడంలేదు.. ప్లాస్టిక్ వినియోగం జీవితంలో ఒక భాగమైపోయింది.. అధికారుల నియంత్రణ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారం ఇచ్చేస్తున్నారు.. ఈ చిత్రాల్లోని డ్రైనేజీలనే చూడండి..ప్లాస్టిక్ ఎలా పేరుకుపోయిందో.. కొంత మందైనా గుడ్డ సంచినే వాడతామని ఈ రోజు ఒక ప్రతిజ్ఞ చేయండి..ప్లాస్టిక్ భూతాన్ని వదిలించండి..

మహా.. భూతం!

ఈ రోజే వదిలేద్దాం!



- పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం
- మానవ జీవనానికి విఘాతం
- ప్రమాదమన్నా పట్టని వైనం
- గుడ్డ సంచిని వదిలేసిన జనం
- ప్లాస్టిక్ సంచులతో కాలక్షేపం
- కొరవడిన అధికారుల నిఘా
- వ్యాపారుల ఇష్టారాజ్యం
- ప్లాస్టిక్‌పై చాగంటి ఆవేదన

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మనిషి మనుగడపై మనిషే గొడ్డలి వేటు వేసుకుంటున్నాడు..జీవరాశి మనుగడను ప్రమాదంలో పడేస్తున్నాడు.ఇందులో ప్రధానమైనది ప్లాస్టిక్.. ప్రస్తుతం ప్రళయంగా ముంచెత్తుతోంది. కంటికి కనిపించని ప్లాస్టిక్ రేణువులు క్యాన్సర్‌కి కారణమవుతుండగా..మనం వాడిపడేస్తున్న ప్లాస్టిక్ కవర్లు,ఉపకరణాలు పర్యావరణాన్ని కాటు వేస్తున్నాయి.డ్రైనేజీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి.ప్లాస్టిక్ సంచులు ఫ్యాషన్ అనుకుంటూ.. వస్త్రం,నారతో చేసి చేతి సంచులను పక్కన పడేసి రకరకాల జబ్బులను కొనితెచ్చు కుంటున్నాం. ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్న వస్తువులన్నీ ప్లాస్టిక్ సంచులు, కవర్లలోనే ఉంటున్నాయి. ప్రస్తుతం అంతా ప్లాస్టిక్‌మయం..ఈ వ్యర్థాలు స్వచ్ఛ భారత్‌కి సవాల్ విసురుతున్నాయి.

ఎక్కడ చూసినా..

ప్లాస్టిక్ భూతం మానవ మనుగడలో అంతర్భాగమైపోయింది. ఏదో రకంగా ప్రతి రోజూ ప్లాస్టిక్‌తోనే పయనం సాగిస్తున్నాం.ప్లాస్టిక్ (పాలిథీన్) సంచులు విచ్చలవిడిగా వాడేస్తు న్నాం.

కీడు అంతా ఇంతా కాదు..

ఒక్క ప్లాస్టిక్ కవరు భూమిలో కలవడానికి 10 లక్షల సంవత్సరాలు పడుతుందట. ఈలోపు అది చేసే కీడు అంతా ఇంతా కాదు. వర్షం నీటిని భూమిలో ఇంకనివ్వవు. భూగర్భజలాలు తగ్గిపోతాయి. డ్రైన్లు పూడికతో నిండిపోతాయి. నదీ జలాలు కలుషితం అవుతాయి. జీవరాశి మృత్యువాత పడుతుంది. మనుషులు రకరకాల రుగ్మతల బారిన పడుతున్నారు. అందువల్ల పాలిథీన్,సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధిస్తూ స్వీయ శపథాన్ని ఈ రోజే చెయ్యండి.వేడుకలు, హోటళ్లు తదితర చోట్ల కాగితం గ్లాసులు, అరటి, విస్తరి (అడ్డాకులు) ఆకుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలి. అరటి, అడ్డాకు విస్తరిలో భోజనం శ్రేష్టమని పెద్దలు ఎప్పుడో చెప్పారు కదా!మిగతా ప్లాస్టిక్ ఉపకరణాలను తగ్గించాలి.ఇంటి నుంచి బయ టకు వెళ్లేప్పుడు జనపనార,వస్త్రంతో చేసిన సంచులను తీసుకెళ్లడం బాధ్యతగా అనుకుంటే ప్లాస్టిక్ సమస్యలకు పరిష్కారం దొరికినట్లే.

అన్ని మైక్రాన్లు, ఇన్ని మైక్రాన్లు అంటూ పరిమితుల మాట ఎలా ఉన్నా జీవరాశి మను గడకు పెనుముప్పుగా పరిణమించాయనేది ఎన్నో సర్వేలు తేల్చిన నిజం.అయినా జనం పెడచెవిన పెడుతుండగా..ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోవడం లేదు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని వినియోగించడం వంటి వాటి వల్ల ఒక మనిషి శరీరంలోకి వారానికి సగటున 5గ్రాముల మైక్రో ప్లాస్టిక్‌లు చేరుతున్నాయని ఓ సర్వే భయంకరమైన నిజాన్ని బయట పెట్టింది. ప్లాస్టిక్ తయారీకి ముడి చమురును మూల పదార్థంగా వాడతారు. వివిధ ఆకృతులు, రంగులు రావడానికి ఎన్నో రసాయనాలు కలుపుతారు.వీటి వల్ల రకరకాల క్యాన్సర్లు, హార్మోన్ అసమతుల్యత, గర్భం దాల్చడంలో ప్రతికూలతలు, చర్మ వ్యాధులు, శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం..ఇలా రకరకాల రుగ్మతల బారిన పడుతున్నామని సర్వేలు పోరు పెడుతూనే ఉన్నాయి.

జిల్లాలో రోజుకు 50 టన్నులు

తూర్పుగోదావరి జిల్లాలో రోజుకు సగటున 200 టన్నుల వ్యర్థాలు వేడుకలు, గృహాలు, వాణిజ్య ప్రదేశాల నుంచి ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలో కనీసం 50 టన్నులపైనే ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయనేది చేదు నిజం. వీటిలో అధిక శాతం సింగిల్ యూజ్(ఒకసారి వాడి పారేసేవి), పాలిథీన్, ఆహార పదార్థాల ప్యాకింగ్ కవర్లను స్థానిక సంస్థలు నిషేధించినా.. అమలులో మాత్రం చిత్తశుద్ధి కొరవడింది. కిందిస్థాయి సిబ్బందికి డబ్బులు వచ్చే మార్గంగా జరిమానాల తంతు మారిపోయింది.దీంతో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ సంచులు, కవర్లు ఉంటున్నాయి. అసలు అవి విక్రయించే దుకాణాల ద్వారా రోజూ కనీసం టన్ను వరకూ పాలిథీన్ కవర్లు జనాల్లోకి వెళుతున్నాయని ఓ అంచనా ఉంది.అయితే స్వచ్ఛ భారత్ వంటి పురస్కారాల కోసం ఈ ప్లాస్టిక్ వ్యర్థాల లెక్కను తొక్కిపడుతున్నారనే విమర్శలున్నాయి.



ఇదీ పాలకుల బాధ్యత..

ప్లాస్టిక్.. ముఖ్యంగా పాలిథీన్ సంచులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే నిబద్ధతతో యంత్రాంగం నిషేధాన్ని అమలు చేయాలి.దీనిలో రాజకీయ నాయకులు భాగస్వామ్యం కావాలి.విస్తృతంగా అవగాహన కల్పించాలి. జనపనార, వస్త్రంతో చేసిన సంచుల తయారీదారులను ప్రోత్సహించాలి. తక్కువ ధరకు అందుబాటులోకి తేవాలి.స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పంపిణీ చేయడానికి చొరవ చూపాలి. బంగాళా దుంపలతో తయారు చేసిన సంచులను బ్రిటన్,జపాన్‌లో విరివిగా వాడుతున్నారు. బంగాళాదుంప నుంచి తీసే పిండి బయో పాలిమర్ ప్లాస్టిక్ లక్షణాలను కలిగి ఉంటుంది. కాబట్టి ఇది కొద్దిరోజులకే భూమిలో కలిసిపో తుంది. ఇలాంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి.



కాపాడమ్మా.. కోటసత్తెమ్మ

నిడదవోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మకు ఆదివారం విశేష పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి,నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.1,25,053లు ఆదాయం లభించినట్లు సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్,ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

దంచికొట్టిన వాన

2 గంటల పాటు ఏకధాటిగా చినుకులు

రాజమహేంద్రవరంఅర్బన్/ సిటీ/ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒక్కసారిగా ఆకాశం అంతా మబ్బు పట్టిం ది..ఆదివారం 4 గంటలకే చీకట్లు కమ్మేసింది.. కాసేపటికే పెద్ద ఎత్తున వర్షం పడింది..ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసింది.అయితే సాయంత్రం ఊహించని రీతిలో అకస్మాత్తుగా వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. సుమారు రెండు గంటల పాటు దంచికొట్టింది.. చిరుజల్లులు ఆరంభమవడంతో జనం పెద్దగా లెక్క చేయలేదు.. ఆదివారం కావడంతో సాయంత్రం సరదాగా నగరవాసులంతా బయటకు వచ్చేశారు. పెద్ద ఎత్తున వర్షం పడడంతో దిక్కుతోచక ఎక్క డికక్కడ పెద్ద ఎత్తున జనం గుమి గూడిపోయారు. వివిధ పనుల కోసం బయటకు వెళ్లిన వారు ఒక్కసారిగా కురిసిన వర్షంతో తడిసి ముద్దయ్యారు. సాయంత్రం ఐదు గంటల నుంచి వర్షం పడింది. ఉరుములు, మెరుపులు లేకుండా వాతావరణం మారిపోయి ఒక్కసారిగా వర్షం ప్రారంభం కావడంతో ప్రజలు షెల్టర్లలోకి పరుగులు పెట్టారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు రోడెక్కింది. భారీ వర్షానికి రాజ మహేంద్రవరం రూరల్, కడియం మండలాల్లో రైతులు పరుగులు పెట్టారు. సా యంత్రం ధాన్యం పొలంగట్ల వెంబడి సర్దుకునే సమయంలో భారీ వర్షం పడడంతో చాలా చోట్ల రైతులు టార్పాలిన్లు కప్పుకు నేందుకు పరుగులు తీశారు.బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసినా ఇలా ఆకస్మికంగా వర్షం పడుతుందని ఊహించలేదు. రాత్రి సమయంలోనూ ఆకాశంలో మేఘాలు కమ్ముకుని ఉన్నాయి. ఇదిలా ఉంటే గత రెండు రోజులుగా చలి ప్రభావం పెద్దగా లేదు. రాత్రి సమయంలోనూ చలి పెట్టడంలేదు. అల్పపీడనం కారణంగా చోటుచేసుకున్న వాతావరణ మార్పులతో చలి తగ్గినట్టు భావిస్తున్నారు. ఇలాంటి సమయంలో ఒక మోస్తరు వర్షం కురిసినా చల్లదనం లేకపోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.



రాజమండ్రిలో వాన

నేడు పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం యధాతధంగా పీజీఆర్ఎస్ మీకోసం కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం సేవలు సోమవారం నుంచి అందుబాటులో ఉంటాయన్నారు.ఫోన్ నెంబరు మార్పు, కొత్త ఆధార్ నమోదు, పేరు మార్పు, చిరునామ మార్పులతో పాటు రెవెన్యూ అనుబంధ సేవలైన ఆదాయ,నివాస, కుల ధ్రువీకరణ పత్రాల సేవలు అందిస్తారన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవచ్చన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 2473 మంది హాజరు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి జాతీయ ఉపకార వేతన అర్హత పరీక్ష(ఎన్ఎంఎంఎస్) ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది.పరీక్షలు జిల్లావ్యాప్తంగా 13 కేంద్రాల్లో నిర్వహించామని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. పోలీస్, మెడికల్ సిబ్బంది ఉపాధ్యాయుల సహకారంతో పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో 2742 మంది హాజరు కావాల్సి ఉండగా 2473 మంది హాజరయ్యారని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు జరిగాయని డీఈవో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి 7

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

12 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ఉండ్రాజవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 12వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపారు. గ్రామస్థాయిలో భూములకు సంబంధించి అన్ని సమస్యలను పరిష్కరించాలనే ప్రాథమిక లక్ష్యంతో ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తోందని ఆయన తెలిపారు.

ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన



పాతవూరులో ఉమాచోడేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన చేస్తున్న పండితులు



నిడదవోలులో గోలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కొవ్వూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలోని పాతవూరులో ఉన్న శ్రీ ఉమా చోడేశ్వరస్వామికి లక్షబిళ్వార్చన నిర్వహించారు. ఆదివారం రాజమహేంద్రవరంనకు చెందిన తిప్పాబొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, పద్మశ్రీ దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి గణపతిపూజ, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, అమ్మవారికి శ్రీ సూక్త విదానంలో కుంకుమ పూజలు, స్వామి వారికి లక్ష బిళ్వార్చన చేశారు. అనంతరం దేవతామూర్తులను విశేష అలంకరణచేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. ఆలయ అర్చకులు కౌతవరపు బాను, దేవరకొండ ఉమా, దేవరకొండ సాయిప్రసాద్‌లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రవ బాల నాగేంద్రప్రసాద్, ప్రవ సత్యనారాయణ, బందా వెంకటేశ్వరరావు, దామరాజు సచ్చిదానంద, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి హుండీ ఆదాయం రూ. 77,440

కొవ్వూరు గోదావరిగట్టుపై ఉన్న సుబ్రహ్మణ్యస్వామి హుండీ ఆదాయం రూ.77,440లు వచ్చినట్లు ఆలయ ఈవో ఎం.బాలకృష్ణ తెలిపారు. ఆదివారం కొవ్వూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో దేవదాయశాఖ అధికారులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. షష్ఠి సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తుల నుంచి టిక్కెట్ల రూపంలో రూ.38వేలు. హుండీ ఆదాయం రూ.39,440లు కలిసి మొత్తం షష్ఠి ఒక్కరోజు ఆదాయం 77,440లు వచ్చినట్లు ఆలయ ఈవో ఎం.బాలకృష్ణ తెలిపారు.

గోలింగేశ్వరుడికి లక్షపత్రి పూజ

నిడదవోలు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలో వున్న రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి లక్షపత్రిపూజ స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచే స్వామి వారికి విశేష అభిషేకాలు అమ్మవారికి కుంకుమ పూజలు ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాకోళపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేదపండితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం, కార్తీకమాసం ముగింపు సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా సహస్రదీపార్చన

దేవరపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, ఎర్రగులాబీలతో సహస్రనామార్చన, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. సాయంత్రం కాలసర్పదోష నివారణార్థం రాహుకేతువుల పూజ నిర్వహించారు. అనంతరం నిమ్మకాయ డొప్పలతో సహస్రదీపార్చన, నిరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. సహస్ర దీపార్చనలో మహిళా భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు కాత్రు భీమరాజు, ఓరుగంటి లక్ష్మీపతి రాజు, జల్లు రాంబాబు, అంబటి వీరవెంకట సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.



దేవరపలి: ఆలయం వద్ద నిమ్మడొప్పలతో సహస్ర దీపార్చన

విద్యార్థులు క్రీడల్లోను ఆసక్తి చూపాలి

● ద్విసభ్య కమిటి సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు



జిల్లా నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చిన్నతనం నుంచి విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలోను ఆశక్తి కనబర్చేలా తల్లిదండ్రులు శ్రద్ధచూపాలని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు అన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా పాశం విశ్వేశ్వరరావు, అబ్జర్వర్‌గా పి.వి.జి. కృష్ణంరాజులు వ్యవహరించారు. బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఆలపాటి కాశీవిశ్వనాద్ (దొమ్మేరు), కార్యదర్శిగా సీహెచ్ సతీష్‌కుమార్ (నిడదవోలు), కోశాధికారిగా ఎం. బాలసుబ్రహ్మణ్యం (చాగల్లు), ఉపాధ్యక్షుడిగా ఏ.వి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, అనంతలక్ష్మి, దుర్గ, మదుమోహన్, ఆర్.గోపాలకృష్ణ, సహాయ కార్యదర్శులుగా పి.సత్యనారాయణ, కె.సుబ్రహ్మణ్యం, డి.ప్రజ్ఞ, ఎ.సురేష్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పాశం విశ్వేశ్వరరావు తెలిపారు. నూతన అధ్యక్షుడు ఆలపాటి కాశీవిశ్వనాద్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో క్రీడా కారులను ప్రోత్సహించడంతోపాటు జాతీయస్థాయి క్రీడాకారులను తయారుచేయడంలో బాధ్య తగా వ్యవహరిస్తానన్నారు. అదేవిధంగా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అబ్జర్వేషన్ కమిటీ ఛైర్మన్‌గా కంటమణి రామకృష్ణ, వైస్ ఛైర్మన్‌గా సూరపనేని చిన్ని, గౌరవాధ్యక్షుడిగా పరిమి హరిచరణ్, చీఫ్ ప్యాట్రన్‌గా ఎం.వి.ఎస్.రాజు, ప్యాట్రన్‌గా కారింకి సాయిబాబాలను నియమించారు. కె.వి.కె.రంగారావు, యలమాటి సత్యనారాయణ, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

14న లోక్ అదాలత్

● కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి అనూరాధ



మాట్లాడుతున్న జిల్లా జడ్జి అనూరాధ

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడంతో కక్షిదారులకు సమయం, డబ్బు రెండూ ఆదా అవుతాయని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనూరాధ అన్నారు. కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో ఇన్సూరెన్సు న్యాయవాదులతో డిసెంబరు 14న జరుగనున్న జాతీయ లోక్‌అధాలత్‌పై సమావేశం నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా న్యాయవాదులు కోర్టుకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్సూరెన్సు కేసులు వాదించే న్యాయవాదులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యంలో లయన్స్‌కు మొదటిస్థానం

● డాక్టర్ జీ.ఎన్.రావు



డాక్టర్ జీ.ఎన్.రావుతో లయన్స్ ప్రతినిధులు

నిడదవోలు, డిసెంబరు 8(ఆంధ్ర జ్యోతి): నిడదవోలులో లయన్స్ నేత్ర వైద్యశాల ద్వారా గ్రామీణ ప్రజలకు కంటి వైద్యం ఎలాఅందించా లో తెలిసి ందని, అలాగే గ్రామీణ ప్రాంత ప్రజల కు కంటి వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఫౌండర్ ఛైర్‌పర్సన్ డాక్టర్ జి.ఎన్.రావు అన్నారు. ఆదివారం నిడదవోలు పట్టణంలోని రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల 30వ వార్షికోత్సవ వేడుకలను లయన్స్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఫౌండర్ ఛైర్‌పర్సన్ డాక్టర్ జి.ఎన్. రావు మాట్లాడుతూ నిడదవోలు పట్టణంలోని రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాలలో ఇప్పటివరకు 1,39,000 ఆపరేషన్లు నిర్వహించి కంటి వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. అనంతరం ఆసుపత్రి 30 సంవత్సరాల ప్రయాణంపై పుస్తకం ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ నేత్రవైద్య శాల ఛైర్మన్ కొత్తపల్లి రవికుమార్, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే బూరు గుపల్లి శేషారావు, మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, పి.సురేంద్ర కుమార్, బి.శ్రీరా మారావు, ఆసుపత్రి డాక్టర్స్, స్టాఫ్ పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

కోడిపందాలు నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తూ డబ్బు బెట్టింగ్‌గా పెట్టి, కోళ్ళకు కత్తులు కట్టి కోడి పందాలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు మండలం వేములూరు గ్రామశివారులో ఆదివారం వేములూరుకు చెందిన ప్రగడ సత్యనారాయణ, ఆరికిరేవులకు చెందిన రావూరి శ్యామ్‌లు ఇద్దరు కోడిపందాలు నిర్వహిస్తుండగా దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ.1000నగదు, ఒక కోడికత్తి స్వాదీనం చేసుకున్నట్లు సీఐ విశ్వం తెలిపారు.

కొవ్వూరు రోడ్డు ప్రమాదంలో ఊబలంక వాసి మృతి

● నిద్రమత్తులో వ్యాను నుంచి జారిపడిపోయిన వైనం



మల్లిడి అప్పారావు (ఫైల్)

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఊబలంక గ్రామానికి చెందిన మల్లిడి అప్పారావు (63)గా గుర్తించినట్లు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎం.వి. వి.సత్యనారాయణ తెలిపారు. పోలీసులు అం దించిన వివరాల ప్రకారం రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన మల్లిడి అప్పారావు మరి కొంత మందితో కలిసి చేపలవేటకు ఈనెల 6వ తేదీన ఇంటినుంచి బయలుదేరి తెలంగాణా రాష్ట్రం భద్రాచలం జిల్లా మణుగూరు వెళ్లారు. అక్కడ చెరువులో చేపలు పట్టి పని పూర్తికావడంతో మధ్యాహ్నం బడాదోస్తు ట్రక్కు వాహనంలో వలలు ఎక్కించుకుని నలుగురు వ్యక్తులు ఇంటికి బయలుదేరారు. ట్రక్కులో వలలపై పడుకున్న అప్పారావు కొవ్వూరు ఏషియన్ పేయింట్స్ గొడౌన్ సమీపానికి వచ్చేసరికి శనివారంరాత్రి వాహనం నుంచి కిందపడిపోయాడు. కింద పడిపోయిన అప్పారావు పైనుంచి అనేక వాహనాలు వెళ్లిపోవడంతో మృతదేహం ముక్కలు అయిపోయి చెల్లాచెదురుగా పడింది. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ముక్కలు అయిపోయిన మృతదేహన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇది గమనించకుండా మిగిలినవారు ట్రక్కులో ఊబలంక వెళ్లిపోయారు. అక్కడ చూసుకుని అప్పారావు లేకపోవడంతో మరలా అదే వాహణంలో వెనక్కి వెతుక్కుంటూ వచ్చారు. కొవ్వూరు ఏషియన్ పేయింట్స్ గొడౌన్‌వద్ద ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడని తెలిసి కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. మృతదేహం వద్ద ఉన్న దుస్తులను బట్టి మృతుడు మల్లిడి అప్పారావు (63)గా గుర్తించారు. మృతుడు అల్లుడు పెసంగి మోసేరాజు అందించిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

మహిళపై కత్తితో దాడి



గాయపడ్డ గుదే శిరీష

నల్లజర్ల, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) : నల్లజర్లకు చెందిన డ్వాక్రా సీఏ గుదే శిరీషపై అదే గ్రామానికి చెందిన గుర్రాల రాజేష్(రాజు)ఆదివారం కత్తితో దాడి చేసినట్లు శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చర్చి నుంచి తన కుమార్తె పూజితతో ఇంటికి వస్తుండగా తమ కుమార్తె చేయి పట్టుకోవడంతో తాను రాజును అడ్డుకున్నానని, ఇంతలో తన వెంట తెచ్చుకున్న కత్తితో నుదుటిపై దాడిచేసి గాయపర్చినట్లు చెప్పారు. వెంటనే నల్లజర్ల ప్రాదమిక ఆసుపత్రికి తరలించగా తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం చికిత్స పొందుతుంది. గత సంవత్సర కాలం నుంచి తన కుమార్తెను వేదిస్తున్నాడని గ్రామపెద్దలకు చెప్పడంతో తనపై కక్ష పెంచుకుని కక్షపూరితంగా కత్తితో దాడి చేసినట్లు చెప్పారు. ఇదిలావుంటే నల్లజర్ల సీఐ శ్రీనివాస్ మాత్రం శిరీష తన కుమార్తెను పూజితను రాజు వేధిస్తున్నాడని ఆదివారం రాజు రోడ్డుపై కనిపించడంతో వీరి మధ్య ఘర్షణ జరిగిందని తోపులాటలో రాజు శిరీషను నెట్టివేయడంతో రాయిపై పడి నుదిటిపై గాయమైనట్లు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

నల్లజర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న ముత్యాలమ్మ చెరువులో పడి చోడవరం గ్రా మానికి చెందిన మద్దిపాటి సూరిబాబు(50)మృతి చెందినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారంరాత్రి నల్లజర్లకు చెందిన దుగ్గిన లీలాకృష్ణ కుమారుడు పెళ్లికి వీరంపాలెం పంతులుతో కలిసి రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి చోడవరంలో వీరంపాలెం పంతులు కారు దిగి తన బైక్‌పై ఫోన్ మాట్లాడుకుంటూ నల్లజర్ల ముత్యాలమ్మ చెరువు వద్దకు వచ్చి బహిర్భూమికి వెళ్లి కాలు జారి చెరువులో పడినట్లు సూరిబాబు చెప్పులు,బైక్‌నుబట్టి గుర్తించారు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

బిక్కవోలులో కనుల పండువగా రథోత్సవం

మేళతాళాల మధ్య ఊరేగిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



బిక్కవోలులో శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామివారు, మెయిన్‌రోడ్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు

బిక్కవోలు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, బ్యాండు మేళాల మధ్య ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. రథం ముందు బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి కోలాట మండలి సభ్యుల కోలాటం, బ్యాండ్ కచేరిలు, కేరళ వాయిద్యాలు అందర్నీ అలరించాయి. స్వామివారి రథం వంగా వారి వీధి నుంచి మెయిన్‌రోడ్ మీదుగా రాజారావుపేట, గ్రామంలోని పురవీధుల గుండా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. కార్యక్రమంలో లక్ష్మీగణపతి ఆలయ ఛైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, వంగా పుల్లా రెడ్డి, తొండాపు శ్రీనివాసరెడ్డి, మానుకొండ రాంబాబు, నందిపాటి కిషోర్‌రెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, పల్లి రాజారెడ్డి, కొమ్మోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనపర్తి సీఐ సుమంత్ ఆధ్వర్యంలో పోలీసులు రథం చుట్టూ బందోబస్తు నిర్వహించారు.

కండక్టర్ ప్రసాదరావుకు అరుదైన గౌరవం



ప్రసాదరావుకు పురస్కారం ఇస్తున్న సుశీల్‌కుమార్ షిండే

గోపాలపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వేల చింతలగూడెంనకు చెందిన కండక్టర్ కౌలూరి ప్రసాదరావుకు ఢిల్లీలో అరుదైన గౌరవం దక్కి ంది. ఫంక్షన్ అకాడమి ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.సుమనాక్షర్, ఆంధ్ర అకాడమీ అధ్యక్షు డు డాక్టర్ మట్టా ప్రభాత్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన వేడుకలో దళిత సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మాన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి సుశీల్‌కుమార్ షిండే నుంచి మహాత్మజ్యోతి రావు పూలే శ్రేష్ఠ అవార్డు, డాక్టర్ బాబాసాహేబ్ అంబేడ్కర్ ఫెలో షిప్ పురస్కారం ప్రసాదరావు అందుకున్నారు.ప్రసాదరావు మాట్లాడుతూ కండక్టర్‌గా పనిచేస్తూ అటు సాహి త్యంలో నూ ఇటూ చదరంగంలోనూ తన ప్రతిభ గల్లీ నుంచి ఢిల్లీ వరకు వ్యాపించిందన్నారు.జాతీయ స్థాయి అవార్డు అందుకున్న ప్ర సాదరా వుసుగ్రామస్థులు,సహోద్యోగు లు అభినందించారు.

అది రోడ్డా! డంపింగ్ యార్డా?

● ఆవ 100 అడుగులరోడ్డు దుస్థితి ఇది

● పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు



వ్యర్థాలతో నిండిన ఆవ రోడ్డు దుస్థితి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎంతో ప్రాధాన్యం ఉన్న రోడ్డును డంపింగ్ యార్డుగా మార్చేశారు.. పట్టణంలోని వ్యర్థాలను తెచ్చి రోడ్డు పక్కనే పడేస్తున్నారు. ఇదెక్కడో మారుమూల కాదు సుమా..ఇది అనేక ఏళ్లుగా కలలుగన్న రోడ్డు.ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ట్రాఫిక్ తగ్గించడానికి ప్రత్యామ్నాయంగా నిర్మించిన ఆవ రోడ్డు.2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ రోడ్డును శాంక్షన్ చేసి భూసేకరణ చేసి చాలా వరకూ నిర్మాణం చేసింది.గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తయింది.మోరంపూడి నుంచి ఈ రోడ్డు మీదుగా తూర్పు రైల్వే స్టేషన్‌కు వెళ్లడం ఈజీ. అంతే కాకుండా సిటీలోని వాహనాలు షెల్టాన్, తాడితోట, వేంకటేశ్వర హోల్‌సేల్ మార్కెట్ నుంచి ఈ రోడ్డులో సులభంగా రావొచ్చు. పైగా ఫోర్‌లైన్‌తో సెంట్రల్ లైటింగ్‌తో నిర్మించిన రోడ్డు పరిస్థితి ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. డంపింగ్ యార్డులా తయారు చేశారు. రోడ్డుకు ఇరువైపులా చెత్త వేస్తున్నారు. ఈ రోడ్డును డంపింగ్ యార్డులా తయారు చేశారు. దీంతో రోడ్డుమీద పయనమే నరకంగా మారింది. రోడ్డంతా బాగున్నా చెత్త వల్ల కంపు కొట్టడంతో పాటు, చూడడానికి అసహ్యంగా ఉండడంతో ఈ రోడ్డుపై వెళ్లడానికి ఎవరూ ఇష్టపడడంలేదు.





పట్టణంలోని చెత్తతో డంపింగ్‌యార్డులా మారిన ఆవ రోడ్డు

గోదావరిలో చేపలు పట్టేందుకు

45 మందికి లైసెన్సులు అందజేత



కొవ్వూరు యానాధికాలనీలో మత్స్యకారులకు లైసెన్సులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణంలోని యానాదికాలనీలో నివసిస్తున్న 45మంది మత్స్యకారులకు గోదావరినదిలో చేపల వేటకు అనుమతులు ఇస్తూ లైసెన్సులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు. ఆదివారం స్థానిక యానాదికాలనీలో మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. గోదావరినదిలో చేపలు పట్టుకోవడానికి మత్స్యశాఖ మంజూరుచేసిన లైసెన్సులను 45మందికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతులమీదుగా అందజేశారు. సూరపనేని చిన్న, సూర్యదేవర రంజిత్, పెద్దలు గోపాలం, గాంధీ పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసరాలు, వంటపాత్రలు అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

తాళ్లపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజ్జరం గ్రామంలో ఇటీవల కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇళ్లు కాలి నిరాశ్రయులైన వేములూరి భాగ్యం కుటంబానికి ఆదివారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో 10వేల రూపాయల విలువగల నిత్యావసర వస్తువులు, వంట సామాన్లు అందించినట్లు సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండి రాంబాబు, ఎంపీటీసీ చిన్నబ్బాయి, అప్పన హనుమంతరావు, టీఎన్‌టీ గుప్త, పెమ్మాడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగుల క్యారమ్స్ విభాగంలో

కృపానందంకి మొదటి స్థానం



జిల్లా మొదటి బహుమతి పొందిన కృపానందంను సత్కరిస్తున్న స్థానికులు

నిడదవోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా దివ్యాంగుల క్యారమ్స్ విభాగంలో కృపానంద వరప్రసాద్ మొదటి స్థానం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడని పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు రంగా రమేష్ అన్నారు. ఆదివారం నిడదవోలులో వంగా కృపానంద వరప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రంగా రమేష్ మాట్లాడుతూ నేడు అన్ని రంగాలలోను దివ్యాంగులు సైతం తమ ప్రత్యేక తను చాటుతున్నారని అన్నారు. సమాజంలో దివ్యాంగులను ప్రోత్సహిస్తూ వారికి సహకారం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బలగం విశాలాక్షి, ర్యాలి శివ, మునుకోటి బాలాజీ, కొప్పాక రాంబాబు తదితర్లు పాల్గొన్నారు.

నాగసర్ప పూజ



నాగసర్ప పూజ చేస్తున్న దృశ్యం

చాగల్లు, డిశంబరు 8 (ఆంధ్రజ్యోతి) స్థానిక సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామివారి ఆలయంలో నాగసర్ప పూజా కార్యక్రమం జరిగింది. వేదపండితులు లింగాల శ్రీనివాసశర్మ, చెరుకూరి శివ సీతారామ్, పండిత పురోహితులు మంత్రోచ్చరణలతో పూజలు జరిగాయి. గ్రామ సుభిక్షం కోసం, సర్పదోష నివారణ కోసం ఈపూజ నిర్వహించినట్లు తెలిపారు. ఆళ్ళ మోహన రావు దంపతులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.